
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పల్నాడు జిల్లా వార్తలు

5

మంగళవారం 8 జూలై 2025

బడి బస్సు భద్రతపై.. ప్రశ్నలెన్నో!


- ఫిట్నెస్ పరీక్షలు తొలిసారిగా ప్రైవేటుకు అప్పగింత
- ఏ పరీక్షలు నిర్వహించారో తెలియని పరిస్థితి
- ప్రారంభం కానీ రవాణాశాఖ తనిఖీలు
- బస్సుల సామర్థ్యంపై తల్లిదండ్రుల ఆందోళన

8



పెంచుకుందాం... పంచుకుందాం...

సాగునీటి కాల్వల్లో కాసుల వేటకు ఓ అధికారే తెర తీశారు. మరమ్మతు పనుల వ్యయం అంచనాలు పెంచి.. కొందరు సాగు నీటి సంఘాల అధ్యక్షులతో బేరసారాలకు దిగారు. కొంత తనకిచ్చి.. మిగిలింది మీరు తీసుకోండి అంటూ దాదాపు రూ.65 లక్షల స్వాహాకు రంగం సిద్ధం చేశారు. తన చేతికి 'మట్టి' అంటకుండా.. పెంచిన అంచనాలతో పనులు ఓకే చేయించేలా.. ఉన్నతాధికారులపై సాగు నీటి సంఘాల అధ్యక్షులతోనే ఒత్తిడి తెస్తున్నారు. ఇప్పుడు ఈ వ్యవహారం జల వనరుల శాఖలో చర్చనీయాంశంగా మారింది.



- కాల్వల మరమ్మతుల్లో అధికారి కాసుల వేట
- సాగునీటి సంఘాల అధ్యక్షులతో బేరసారాలు
- అంచనాలు పెంచి.. రూ.65 లక్షల స్వాహాకు ప్రణాళిక
- చేతికి 'మట్టి' అంటకుండా.. వారితోనే ఉన్నతాధికారులపై ఒత్తిడి

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి): నరసరావుపేట నియోజకవర్గ పరిధిలోని 26 సాగునీటి కాల్వల మరమ్మతులకు ప్రభుత్వం రూ.1.30 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఒక్కో పని రూ.5 లక్షల వ్యయంతో చేపట్టేందుకు అంచనాలు రూపొందించారు. పూడిక తీత, చెట్లు, జమ్ము తొలగింపు పనులు చేపట్టాల్సి ఉంది. మైనర్ కాల్వల కట్టలు నాలుగు అడుగులు ఉంటాయి. వాహనం తిరిగే అవకాశం ఉండదు. ఇటువంటి కట్టలకు గ్రావెల్ వేయడం నిబంధనల్లో లేదు. నాలుగు మీటర్లు ఉన్న కట్టలకు మాత్రమే గ్రావెల్ పనులకు అనుమతి ఉంది. అయితే నిబంధనలకు విరుద్ధంగా ఓ అధికారి నాలుగు అడుగులు ఉన్న కట్టలకు కూడా గ్రావెల్ పోసేలా అంచనాలు రూపొందించారు. కట్టలపై 20 సెమీ మందం గ్రావెల్ వేసేలా ఒక్కో కాల్వకు రూ.2 లక్షల వరకు వ్యయం ఎక్కువగా చూపించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. కొందరు నీటి సంఘాల అధ్యక్షులను సదరు అధికారి ప్రలోభపెట్టినట్లు తెలిసింది. పెంచిన అంచనాల్లో తనకు కొంత ఇచ్చి.. మిగతా వారు తీసుకోవచ్చని బేరసారాలు చేసినట్లు తెలిసింది. సుమారు రూ.65 లక్షలు కాజేసేందుకు కుట్ర జరుగుతోందని జలవనరుల శాఖలో అవినీతి గుప్పుమంటోంది. ఈ పెంచిన అంచనాలు ఆమోదించే విధంగా నీటి సంఘాల్లోని కొంతమంది చేత ఉన్నతాధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. నియోజకవర్గ ముఖ్య నేత వద్ద కూడా ఈ పంచాయితీ జరిగినట్లు తెలిసింది. 'పార్టీ నేతలు పనులు చేసుకుంటారు.. చూసి చూడనట్లు ఉండాలి.' అని అధికారులను సదరు నేత ఆదేశించినట్లు సమాచారం. నిబంధనలకు విరుద్ధంగా చేపట్టబోతున్న ఈ పనుల విషయంలో.. ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటారో లేదో చూడాలి. చర్యలు తీసుకుంటే రూ.65 లక్షలు దోపిడీకి గురికాకుండా చూసే అవకాశం ఉంది. దీనిపై జలవనరుల శాఖ ఈఈ డీవీ సుబ్బారావును వివరణ కోరగా సదరు పనుల వ్యయం అంచనాలను పరిశీలించి, తగిన చర్యలు తీసుకుంటామని సమాధానం ఇచ్చారు.



పిచ్చిమొక్కలతో రొంపిచర్ల మైనర్ కాలువ

కరిగిపోతున్న సాగు కాలం!

- 66 మండలాల్లో తీవ్ర వర్షాభావం
- విత్తు కోసం ఆకాశం వైపు రైతుల చూపు
- నైరుతీ నిరాశ..సంక్షోభంలో సాగు

ఖరీఫ్ సాగు కాలం కరిగిపోతోంది. దుక్కులు దున్ని.. రైతులు విత్తు కోసం ఆకాశం వైపు ఆశగా చూస్తున్నారు. మేలో ఊరించిన వర్షాలు జూన్‌లో ముఖం చాటేశాయి. నైరుతి నిరాశ పరిచింది. సాగు సందిగ్ధంలో పడటంతో అన్నదాతలు ఆందోళనలో ఉన్నారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల జిల్లాల్లో 71 మండలాలకు 66 మండలాల్లో తీవ్ర వర్షాభావం నెలకొంది. కేవలం ఐదు మండలాల్లోనే సాధారణ వర్షపాతం నమోదైంది. వరుణుడి కరుణ కోసం ఎదురుచూస్తున్నారు.



ఖరీఫ్‌పై ప్రభావం చూపుతున్న వరుణుడు

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

ఖరీఫ్‌లో పల్నాడు జిల్లాలో 4,53,205, బాపట్ల జిల్లాలో 2,80,353, గుంటూరు జిల్లాలో 2,25,525 ఎకరాల్లో రైతులు పంటలు పండిస్తారని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. సీజన్ ప్రారంభమై వారాలు గడుస్తున్నా ఇంకా వ్యవసాయం ఊపందుకోలేదు. మేలో కురిసిన వర్షాలకు రైతులు దుక్కులు దున్ని పొలాలు సిద్ధం చేసుకున్నారు. ఇప్పటి వరకు పల్నాడు జిల్లాలో 15,650, బాపట్లలో 863, గుంటూరులో 1,905 ఎకరాల్లో పంటలు సాగు చేసినట్లు వ్యవసాయ శాఖ గణాంకాలు చెబుతున్నాయి. ఇక పల్నాడులో బోరు బావుల కింద పత్తి సాగు చేపట్టారు.

- పల్నాడు జిల్లాలో 28 మండలాలకు గాను ఒక్క మాచర్ల మండలంలో మాత్రమే సాధారణ వర్షపాతం నమోదైంది. మిగతా 27 మండలాల్లో వర్షాభావం ఏర్పడింది. 15 మండలాల్లో అత్యధిక లోటు, 12 మండలాల్లో లోటు వర్షపాతం నమోదైంది. ఈ జిల్లాలో ఇప్పటి వరకు 108 మి.మీ సాధారణ వర్షపాతం నమోదు కావాలి. అయితే ఇప్పటికి 41.9 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. 61.2 శాతం లోటు వర్షపాతం నమోదైంది.
- బాపట్ల జిల్లాలో 94.20 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు 51.1 మి.మీ వర్షపాతం నమోదైంది. 45.8 శాతం లోటు వర్షపాతం నమోదైంది. 25 మండలాలకు.. 11 మండలాల్లో అత్యధిక లోటు వర్షపాతం, 12 మండలాల్లో లోటు, కర్లపాలెం మండలంలో సాధారణ, నిజాంపట్నం మండలంలో

(మిగతా 6వ పేజీలో)

జిల్లాల వారీగా నమోదైన వర్షపాతం మీమీలలో..

జిల్లా	సాధారణం	నమోదైంది	లోటు శాతం
పల్నాడు	108	41.9	61.2
బాపట్ల	94.2	51.1	45.8
గుంటూరు	131.1	68.3	47.9

అక్రమ మైనింగ్‌ను అరికట్టండి

- కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఆదేశాలు

నకరికల్లు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): అక్రమ మైనింగ్ కార్యకలాపాలను అరికట్టాలని పల్నాడు జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు అధికారులను ఆదేశించారు. గ్రావెల్ తవ్వకాలపై అందుతున్న ఫిర్యాదులకు తక్షణమే స్పందించేలాగ వ్యవస్థను ఏర్పాటు చేయాలని రెవెన్యూ, మైనింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా వచ్చే అర్జీలను వెంటనే పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు స్పష్టం చేశారు. 90 రోజులు వ్యవధి ఉన్న కారణంగా వీఆర్వోలు కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. రీ ఓపెన్ అయిన అర్జీలు, మ్యుటేషన్‌లు త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. రీ సర్వే జరుగుతున్న గ్రామాల్లో ఎదురవుతున్న సమస్యలు, పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు కలెక్టర్ పలు సూచనలు జారీ చేశారు. ఇళ్ల పట్టాలదర ఖాస్తుల పరిశీలన, నిర్మాణాల రెగ్యులరైజేషన్‌పై గ్రామాల వారీగా సమీక్షలు నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే పీజీఆర్ఎస్‌లో వీఆర్‌వోలు, సర్వేయర్లు అందరూ తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. ప్రభుత్వ భూముల్లో మైనింగ్, ఆక్రమణలు జరిగినా తక్షణం చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్ వెంట జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, ఆర్డీవో రమణాకాంత్‌రెడ్డి, జిల్లా మైనింగ్, జియాలజీ అధికారి నాగిని, సర్వే ఏడీ భాను కీర్తి, తహసీల్దార్ కె.పుల్లారావు ఉన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ పి.అరుణ్‌బాబు

టీచర్ లేని.. తరగతి గది!



700 మంది విద్యార్థులు.. ఐదుగురే టీచర్లు

- సార్ వస్తారు.. పాఠం చెబుతారని ఎదురు చూపులు
- మధ్యాహ్నం భోజనం చేసి.. ఇంటికి విద్యార్థులు
- ఇదీ వినుకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల దుస్థితి..



రెండు తరగతి గదుల్లోని విద్యార్థులకు ఒకే టీచర్ పాఠాలు

వినుకొండటౌన్, జూలై 7, (ఆంధ్రజ్యోతి): ఉదయాన్నే బ్యాగు తగిలించుకుని బడికెళ్తున్నారు. తరగతి గదిలో పుస్తకాలు తీసి కూర్చుంటున్నారు. సార్, మేడం వచ్చి పాఠం చెబుతారని ఎదురు చూస్తారు. రోజులో ఎవరో ఒకరిద్దరు టీచర్లు వచ్చి పాఠాలు చెప్పి వెళ్లిపోతారు. మిగిలిన సమయం అంతా తరగతి గదిలో ఎవరైనా వచ్చి పాఠం చెబుతారా.. అని ఎదురు చూపులే విద్యార్థులవి. నెలలు గడుస్తున్నా.. ఒక్క పాఠ్యాంశం కూడా పూర్తి కాదు. ఇదీ.. వినుకొండలోని ప్రభుత్వ బాలుర పాఠశాల దుస్థితి. ఎన్నో ఆశలతో పాఠశాలలో చేరిన విద్యార్థులు ఉపాధ్యాయుల కొరత కారణంగా రోజుల తరబడి తరగతి గదుల్లో ఖాళీగా కూర్చుని.. ఇంటికి తిరిగొస్తున్నారు. విద్యా సంవత్సరం క్యాలెండర్ మారుతున్నా.. ఉపాధ్యాయులను మాత్రం ప్రభుత్వం నియమించలేదు. వినుకొండ పట్టణంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో ఈ విద్యా సంవత్సరం 700 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అందులో పదో తరగతి విద్యార్థులే 150 మంది ఉన్నారు. వీరికి 21 మంది ఉపాధ్యాయులు పాఠాలు బోధించాలి. కానీ, ప్రస్తుతం ఐదుగురు ఉపాధ్యాయులు మాత్రమే పని చేస్తున్నారు. వారిలో ఒకరు మెటర్నటీ లీవ్‌లో ఉన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలో వినుకొండ, గురజాల, విజయపురిసౌత్‌తో కలుపుకుని మూడు ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ఈ మూడు పాఠశాలల్లోనూ ఉపాధ్యాయుల

(మిగతా 6వ పేజీలో)

కోర్టు భవనాల కోసం స్థల పరిశీలన

చిలకలూరిపేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఉన్న రెండు కోర్టులకు నూతన భవనాల నిర్మాణానికి అనువైన స్థలాలను ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు, సీనియర్ న్యాయవాదులతో కలిసి సోమవారం పరిశీలించారు. ప్రస్తుతం ఒక కోర్టు అద్దె భవనంలో, మరో కోర్టు భవనం శిథిలావస్థకు చేరిందని న్యాయవాదులు ఎమ్మెల్యే ప్రత్తిపాటి దృష్టికి తీసుకువచ్చారు. జిల్లా జడ్జి, స్థానిక ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కూడా కోర్టు భవనాలకు స్థలం కేటాయించాలని కోరారు. స్థానిక నరసరావుపేట రోడ్డులో గంగమ్మ గుడి వెనుక భాగంలో ఉన్న ఎకరం స్థలాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ షేక్ రఫాని, కమిషనర్ పి.శ్రీహరిబాబు, డీఈ రహీం, బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, రాజ్ కుమార్, సీనియర్ న్యాయవాదులు పోలూరి పాండురంగారావు, ఈవూరి బ్రహ్మానందం, కౌన్సిలర్ జంగా సుజాత పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేటలో భారీ చోరీ

చిలకలూరిపేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): శారదా స్కూలు సమీపంలో నివసించే ఇమ్మడి కృష్ణ చైతన్య అనే వ్యక్తి ఇంటిలో భారీ చోరీ జరిగింది. దొంగలు బీరువాలు పగులగొట్టి సుమారు రూ.2.75 లక్షల నగదు, 70 గ్రాముల బంగారం, మూడు కిలోల వెండి, సుమారు 40 పట్టు చీరలను దొంగిలించారు. యజమానులు శనివారం రాత్రి ఇంటికి తాళాలు వేసి అవనిగడ్డకు వెళ్లారు. సోమవారం ఉదయం వచ్చేసరికి ఇంటి తలుపులు పగలగొట్టి చోరీ జరిగిన విషయాన్ని గుర్తించారు. బాధితులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఎస్‌ఐ చెన్న కేశవులు దొంగతనం జరిగిన ఇంటిని పరిశీలించారు. క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించింది. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పీఎంశ్రీకి రెండు పాఠశాలల ఎంపిక

- మారనున్న రూపురేఖలు

సత్తెనపల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా(పీఎంశ్రీ) పథకానికి మండలంలోని బృగుబండ జడ్పీ, పట్టణంలోని సుగాలీ కాలనీ ఉన్నత పాఠశాలలు ఎంపికైనట్లు ఎంఈవో శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. దీంతో ఆయా పాఠశాలల్లో అధునాతన మౌలిక వసతులు కల్పిస్తారని చెప్పారు. అందుకు అయ్యే ఖర్చును కేంద్రం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం భరిస్తాయని ఆయన తెలిపారు. అదనపు వసతి, ల్యాబ్‌లు, గ్రంథాలయాలు, కిచెన్ గార్డెన్‌లు, ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయటం జరుగు తుందని చెప్పారు. ఇప్పటికే బృగుబండ పాఠశాలలో క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేయడం జరిగిందని, అదనపు గదుల నిర్మాణాలు కూడా జరుగుతున్నాయని వెల్లడించారు. ఆయా పాఠశాలల్లో సైన్స్, కంప్యూటర్ ల్యాబ్‌లు ఏర్పాటు చేస్తారని పేర్కొన్నారు. పాఠశాలల నిర్వహణకు విద్యార్థుల సంఖ్యను బట్టి రూ.50 వేలు నుంచి రూ.1.50 లక్షల వరకు నిధులు కేటాయిస్తారని ఎంఈఓ వెల్లడించారు.



పీఎంశ్రీ పథకానికి ఎంపికైన బృగుబండ హైస్కూల్



ఘాటెక్కిన పచ్చిమిర్చి

- కిలో రూ.80
- రూ .40కి చేరిన టమోటా
- అదే బాటలో కూరగాయాలు

8

పోక్సో కేసులో నిందితుడికి జీవితఖైదు

అటవీ ప్రాంతంలో పేకాట శిబిరంపై దాడి

- పోలీసుల అదుపులో 22 మంది
- రూ.1,87,680 నగదు స్వాధీనం

6

వెలుగులివ్వని సూర్యఘర్

- నత్తనడకన సోలార్ రూఫ్‌టాప్‌ల ఏర్పాటు
- లక్ష్యంలో పది శాతం కూడా చేరుకోని వైనం
- మూడు జిల్లాల్లో అమర్చిన యూనిట్లు 6 వేల లోపే
- ప్రజలకు అవగాహన కల్పనలో అధికారుల విఫలం

(చిలకలూరిపేట, ఆంధ్రజ్యోతి)

విద్యుత్ బిల్లుల నుంచి వినియోగదారులకు ఉపశమనం కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పీఎం సూర్యఘర్ పథకం లక్ష్యాలను చేరుకోవడం లేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా.. దశల వారీగా ప్రతి ఇంటిని సోలార్ గొడుగు కిందకు తెచ్చేందుకు పనిచేస్తున్నాయి. గతేడాది ఫిబ్రవరిలోనే ఈ పథకం పట్టాలెక్కిన వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఇక్కడ అమలుకు నోచుకోలేదు. కూటమి ప్రభుత్వం సోలార్ విద్యుత్‌పై ప్రత్యేక దృష్టిసారించి అడుగులేస్తోంది. పీఎం సూర్యఘర్ పథకం ద్వారా తొలి దశలో ఒక్కో నియోజకవర్గంలో పదివేల ఇళ్లకు సోలార్ రూఫ్‌టాప్‌లు ఏర్పాటు చేయాలని సంకల్పించింది. మూడు జిల్లాల పరిధిలో 5 లక్షల గృహాలను సోలార్ విద్యుత్ గొడుకు కిందకు తేవాల్సి ఉంది. కానీ, క్షేత్రస్థాయిలో అనేక బాలారిష్టాలకు తోడు.. అధికారుల నిర్లిప్తత కారణంగా.. ఈ పథకం అమలులో ఆశించిన స్థాయిలో వేగం కనబడడం లేదు. దీనికి తోడు ఆయా విభాగాల మధ్య సమన్వయ లోపం కూడా పీఎం సూర్యఘర్‌కు ప్రతిబంధకంగా మారింది.

పొంతన లేదు..

సోలార్ ప్యానెల్ ఏర్పాటుకు.. ఆసక్తి కలిగిన వారిపేర్ల నమోదును గతేడాది చివరిలో ప్రారంభించి ఈ ఏడాది మార్చి వరకు కొనసాగించారు. తర్వాత ప్రక్రియలో దరఖాస్తులను స్వీకరించారు. మూడు జిల్లాల పరిధిలో పేర్లు నమోదు చేసుకున్న వారి సంఖ్య దాదాపు 2 లక్షల వరకు ఉంటే.. వచ్చిన దరఖాస్తుల సంఖ్య 60 వేల లోపే ఉండడం గమనార్హం. దీనికి సమాంతరంగానే.. ఈ పథకం కింద ఉచితానికి అర్హులైన ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులను గుర్తించే పనిని కూడా యంత్రాంగం చేపట్టింది.

అవగాహన కల్పించడంలో విఫలం

పీఎం సూర్యఘర్ పథకం ద్వారా ఇళ్లపై సోలార్ రూఫ్‌టాప్‌లు ఏర్పాటుకు.. లక్ష్యాలు (మిగతా 6వ పేజీలో)



బాపట్లలో ఓ ఇంటిపై సోలార్ ప్యానెళ్లను పరిశీలిస్తున్న అధికారులు

కరిగిపోతున్న సాగు కాలం!

(5వ పేజీ తరువాయి)

అధిక వర్షపాతం నమోదైంది.

● గుంటూరు జిల్లాలో 47.9 శాతం లోటు వర్షపాతం నమోదైంది. ఇప్పటి వరకు 131.1 మి.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. 68.3 మి.మీ వర్షపాతం నమోదైంది. జిల్లాలో 18 మండలాలకు గాను 7 మండలాల్లో అత్యధిక లోటు వర్షపాతం, తొమ్మిది మండలాల్లో లోటు, ప్రత్తిపాడు, పెదనందిపాడు మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. గతేడాది సమృద్ధిగా వర్షాలు కురిసి, ప్రాజెక్టులు నిండటంతో పంటలను విస్తృతంగా సాగు చేశారు. ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమై రోజులు గడుస్తున్నా అక్కడక్కడ చిరు జల్లులు తప్పా పంటల సాగుకు అనుకూలమైన వర్షాలు కురవలేదు. వర్షాభావం ఇలానే కొనసాగితే సాగుకు గడ్డు కాలమేనన్న ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది. వర్షాలు కురిపించాలని వరుణుడిని రైతులు ప్రార్థిస్తున్నారు.

టీచర్ లేని తరగతి గది!

(5వ పేజీ తరువాయి)

కొరత కారణంగా అనుకున్న స్థాయిలో ఫలితాలు సాధించలేక పోతున్నట్లు సమాచారం.

టీచర్ల సర్దుబాటు..



వినుకొండలోని ప్రభుత్వ బాలుర పాఠశాల

గతంలో కూడా పాఠశాలలో ఇదే పరిస్థితి ఉండడంతో విద్యార్థుల తల్లిదండ్రుల సాయంతో ప్రజా సంఘాల నాయకులు నిరసనలు చేపట్టారు. దీంతో అప్పటి విద్యాశాఖ ఆర్జేడీ ఉపాధ్యాయులను సర్దుబాటు చేశారు. సుమా రు 15 మందిని పాఠశాలకు కేటాయించారు. ఉపాధ్యాయుల చేరవతో 2024- 2025 విద్యా సంవత్సరానికి పదవ తరగతి పరీక్ష ఫలితాల్లో 70 శాతం ఉతీర్ణత సాధించారు. ఉపాధ్యాయులు కేటాయింపు ఏప్రిల్ 2వ తేదీతో ముగిసింది. మళ్లీ ఉపాధ్యాయుల కొరత ఏర్పడింది. ఉపాధ్యాయులు లేక పోవడంతో విద్యార్థులు మొక్కుబడిగా పాఠశాలకు వచ్చి..మధ్యాహ్నం భోజనం చేసి ఇంటికి వెళ్తున్నారు. ఉన్న ఒకరిద్దరు ఉపాధ్యాయులు రెండు మూడు తరగతుల విద్యార్థులను ఒక చోట చేర్చి పాఠాలు బోధిస్తున్నారు. భాషా ఉపాధ్యాయుల అయితే ఒక్కరూ లేరు. ఈ విధంగానే.. తమకు కేటాయించిన పాఠ్యాంశాలను పూర్తి చేస్తున్నట్లు ప్రధాన ఉపాధ్యాయులు డాక్టర్ వి. యశోద తెలిపారు. పనిభారంతో ఉన్న ఒకరిద్దరూ కూడా సెలవుపై వెళ్లేందుకు చూస్తున్నారని సమాచారం. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పాఠశాలకు సరిపడ ఉపాధ్యాయులను కేటాయించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఆడుదాం ఆంధ్రాపై విజిలెన్స్ విచారణ



మాట్లాడుతున్న విజిలెన్స్ సీఐ సైదులు

నూజెండ్ల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో జరిగిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో నిధులు దుర్వినియోగంపై స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో విజిలెన్స్ అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ సీఐ సైదులు ఆధ్వర్యంలో రికార్డులు పరిశీలించి, క్రీడాకారులతో మాట్లాడి క్రీడా పరికరాలు, ప్రోత్సాహక బహు మతుల వివరాలను సేకరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.ఉమాదేవి, స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ ఎన్.వెంకటరత్నం, విజిలెన్స్ అధికారులు శ్రీనివాసరావు ఉన్నారు.

అటవీ ప్రాంతంలో పేకాట శిబిరంపై దాడి

● పోలీసుల అదుపులో 22 మంది ● రూ.1,87,680 నగదు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బైకులతో డీఎస్పీ జగదీష్, పోలీసు సిబ్బంది

దుర్గి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాకిరాల అటవీ ప్రాంతంలో కొందరు పేకాట స్థావరం ఏర్పాటు చేశారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన జూదరులు ఇక్కడ పేకాట ఆడుతున్నారు. సమాచారం తెలుసుకున్న గురజాల డీఎస్పీ జగదీష్ ఆధ్వర్యంలో సోమవారం కారంపూడి సర్కిల్ సీఐ శ్రీనివాసరావు, దుర్గి ఎస్ఐ సుధీర్‌కుమార్, రెంటచింతల ఎస్ఐ నాగార్జునతోపాటు 40 మంది పోలీసు సిబ్బందితో దాడి చేశారు. ఈ దాడికి సంబంధించిన వివరాలను డీఎస్పీ జగదీష్ దుర్గి పోలీస్‌స్టేషన్లో విలేకరులకు వెల్లడించారు. శిబిరంలో పేకాట ఆడేందుకు ఎంట్రీ ఫీజు కింద రూ.300 నుంచి రూ. 500 వరకు వసూలు చేస్తున్నారని చెప్పారు. వీరు ఏజెంట్లను ఏర్పాటు చేసుకొని, పోలీసుల కదలికలను పసిగడుతూ జూదరులకు సమాచారం ఇస్తుంటారని పేర్కొన్నారు. పోలీసుల దాడిలో 23 ద్విచక్రవాహనాలతోపాటు రూ. 1,87,680 నగదును స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అలాగే 22 మందిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. వీరిని కోర్టులో హాజరుపరచనున్నామని, కాగా మరికొందరు పరారైనట్లు తెలిపారు.

ఆర్టీసీలో అక్రమ ఓడీలపై విచారణ!

● ఇప్పటికే విజిలెన్స్ నివేదిక ● ఓడీలపై మార్గదర్శకాలు జారీ చేసిన కేంద్ర కార్యాలయం

గుంటూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ డిపోల్లో అక్రమ ఓడీలపై ఉన్నతాధికారులు రహస్యంగా విచారణ జరుపుతున్నట్లు తెలిసింది. డిపోల్లో అక్రమ ఓడీలపై గత నెలలో 'ఆంధ్రజ్యోతి' జిల్లా సంచికలో 'ఆర్టీసీలో అక్రమ 'ఒరవోడీ ' పేరుతో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీనిని ఆర్టీసీ ఉన్నతాధికారులు సీరియస్‌గా పరిగణించినట్లు తెలిసింది. అలానే ఆర్టీసీ విజిలెన్స్ కూడా ఇప్పటికే నివేదిక అందజేసినట్లు సమాచారం. విభజిత గుంటూరు జిల్లా పరిధిలోని గుంటూరు -1 , 2 డిపోలతో పాటు మంగళగిరి, పొన్నూరు. తెనాలి డిపోలలో ఓడీ (అవుట్ ఆఫ్ డిజిగ్నేషన్) పేరుతో కొందరు ఉద్యో గులు దర్జాగా విధులు నిర్వహిస్తోన్న వైనంపై కథనంలో ప్రస్తావించడం జరిగింది. గుంటూరు 2 డిపోలో అత్యధికంగా 18 మంది అక్రమ ఓడీలు పొందడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గుంటూరు-1 డిపోలో 16 మంది, తెనాలి డిపోలో ఏడుగురు, పొ న్నూరు డిపోలో నలుగురు, మంగళగిరి డిపోలో ఐదుగురు మొత్తం 48 మంది ఉద్యోగులు ఓడీలపై విధులు నిర్వహించడంపై ఉద్యోగ సంఘాల నాయకులు మండిపడుతున్నారు. ఆర్టీసీలో ఓడీ వినియో గించుకోవాలంటే సంబంధిత జోనల్ కార్యాలయం అనుమతి తప్పని సరి అయినప్పటికీ ఇక్కడ అటువంటి నిబంధనలు ఏవి పాటించ లేదన్న విమర్శలు ఉన్నాయి. వాస్తవానికి అత్యవసర పరిస్థితుల్లో ఉద్యోగాలు చేసే వారికే ఈ ఓడీ సదుపాయం ఉంటుంది.



ఓడీలపై ప్రత్యేక మార్గదర్శకాలు జారీ

ఉద్యోగులకు ఓడీ ఇచ్చే ముందు సీనియార్టీ పాటించాలని ఉన్నతాధికారులు సూచించారు. మరో వైపు డ్రైవర్, కండక్టర్లను చార్ట్ బుకింగ్, మస్టర్లు, డిస్పాచ్ చార్ట్ విభాగంలో ఉపయోగించకూడదని, అనివార్యమైతే ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ నుంచి అనుమతి తీసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల కొన్ని డిపోల్లో డ్రైవర్లు, కండక్టర్‌లను ఓడీలపై నియమించుకున్నట్లు ప్రధాన కార్యాలయం దృష్టికి వచ్చింది. ఇది కార్యాచరణను ప్రభావితం చేస్తోందని, అంతేగాక సంస్థ ప్రతిష్ఠను దెబ్బతీస్తోందని భావించి స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం.

వయోజన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయాలి

● కలెక్టర్ నాగలక్ష్మి



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

గుంటూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : వయోజన (15-59 సంవత్సరా లు) నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు ప్రవేశపెట్టిన ఉల్లాస్ - అక్షరాంధ్ర కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం జిల్లాలో నిర్దేశించిన ఫలితాలు సాధించాలని కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో కలెక్టర్ అధ్యక్షతన సమాజం లోని అందరికీ జీవిత కాల అభ్యాసనం, అవగాహన (ఉల్లాస్) జిల్లా స్థాయి కమిటీ సమావేశం జరిగింది. కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలో 2025-26 సంవత్సరానికి 90,426 మంది నిరక్షరాస్యులను 2029 నాటికి వందశాతం క్రియాత్మక సాక్షరతను సాధించే విధంగా లక్ష్యం రూపొందించారన్నారు. ఉల్లాస్ ముఖ్యలక్ష్యాలు ప్రాథమిక, ఆర్థిక, డిజిటల్ అక్షరాస్యత, ఆరోగ్య సంరక్షణ అవగాహన, కుటుంబ సంక్షేమంతో జీవన నైపుణ్యాలతో ఉత్తమ పౌర లుగా తీర్చిదిద్దడమే నని అన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం ఎంపీడీవో అధ్యక్షతన మండల, మున్సిపల్ కమిషనర్ అధ్యక్షతన మున్సిపల్ స్థాయిల్లో కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాలు, అంగన్వాడి, ప్రభుత్వ పాఠశాలలో ఆయాలు, వాచ్‌మెన్, కుక్ సర్వే చేసి వీరిలో నిరక్షరాస్యులైన వారిని నిర్దేశించిన లక్ష్యాల మేరకు ఉల్లాస్ యాప్ లో నమోదు చేయాలన్నారు. 2025లో నమోదయ్యే వయోజనులకు 2026 మార్చి నెలలో పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్స్ అందిస్తారన్నారు. ఈ సమా వేశంలో డిప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మికుమారి, డీఆర్వో ఎన్ ఎస్‌కే ఖాజావలి, గుంటూరు ఆర్‌డీవో శ్రీనివాసరావు, జడ్పీ సీఈవో జ్యోతిబసు, వయోజన విద్య డీడీ ఆంజనేయులు, హౌసింగ్ పీడీ ప్రసా దు, డీఆర్‌డీఏ పీడీ విజయలక్ష్మి, సీపీవో శేషశ్రీ తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్ కార్మికుల జీతాలు పెంచాలి

● జీఎంసీ ఎదుట కార్మికుల ఆందోళన

గుంటూరు కార్పొరేషన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కార్మి కుల జీతాలను పెంచాలని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి తెలిపారు. గుంటూరు నగరం మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం ఇంజనీరింగ్ కార్మికుల జీతాలు పెంచాలని, కార్మిక సమస్యలపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కోట మాల్యాద్రి మాట్లాడుతూ గత సమ్మె కాలంలో ఒప్పందాలను వెంటనే అమలు చేయాలని, ప్రధానం గా ఉద్యాన కార్మికులను పారిశుద్ధ్య కార్మికులుగా గుర్తించాలని, వారితో సమానంగా జీతం రూ.21వేలు ఇవ్వాలని కోరినా కానీ ప్రభుత్వం స్పం దించలేదని అన్నారు. అనంతరం కమిషనర్ పులి శ్రీనివాసులుని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్య క్షుడు చినబోతుల వెంకట్రావు, ఉపాధ్యక్షుడు సద్గుణరావు, ఏఐటీయూసీ నగర అధ్యక్షుడు రావుల అంజిబాబు, ఏఐవైఎఫ్ కార్యదర్శి చల్లమరి యదాసు, ఆదినారాయణ, మంగమ్మ, బసవమ్మ, వీరమ్మ, నాగమ్మ, దానియేలుమన్నెమ్మ, బాలమ్మ తదితరులు పాల్గొన్నారు.



జీఎంసీ ఎదుట ధర్నా చేస్తున్న కోట మాల్యాద్రి తదితరులు

నిత్య అన్నదాన పథకానికి రూ.లక్షా16వేల విరాళం



దాతలకు స్వామి వారి జ్ఞాపికను అందజేస్తున్న ఆలయ అధికారులు

పెదకాకాని, జూలై 7(ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరానికి చెందిన ఫణి రాఘవేంద్ర జ్ఞాపకార్థం మల్లికార్జునరావు సోమవారం పెదకాకాని మల్లేశ్వర స్వామి దేవస్థాన నిత్య అన్నదాన పథకానికి రూ.లక్షా16వేలు విరాళం అందించినట్లు ఆలయ ఉప కమిషనర్ గోగినేని లీలాకుమార్ తెలిపారు. ఆలయ అభివృద్ధికి, నిత్య అన్నదాన పథకానికి భక్తులు విరివిగా విరాళం సమర్పించి సహకరించవలసిందిగా ఉప కమిషనర్ భక్తులకు విజ్ఞప్తి చేశారు. దాతలకు ప్రత్యేక దర్శనం, వేద ఆశీర్వచనం చేయించి స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి చిత్రపటం అందజేశారు.

ఆర్వీఆర్ అండ్ జేసీలో ప్రాంగణ నియామకాలు

● 20 మంది విద్యార్థులకు ఉద్యోగాలు

గుంటూరు(విద్య), జూలై 7 (ఆంధ్రజ్యోతి): చౌడవరంలోని ఆర్వీ ఆర్ అండ్ జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో 20మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారని కళాశాల అధ్యక్ష కార్యదర్శులు రాయపాటి శ్రీనివాస్, రాయపాటి గోపాలకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ బెంగ ళూరుకు చెందిన ఎక్సెల్‌ఆర్ కంపెనీలో 9 మంది, ప్రిదిని ఇన్ఫ్రాటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో 7 మంది, ఎవరెస్ట్ ల్యాబ్‌లో ఇద్దరు, బెటర్ క్యాస్టింగ్స్ కంపెనీలో ఇద్దరు చొప్పున మొత్తం 20 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించినట్లు వివరించారు.

వెలుగులివ్వని.. సూర్యఘర్

(5వ పేజీ తరువాయి)

చేరుకోవాలంటే క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించడమే కీలకమని ప్రభుత్వం ప్రారంభంలోనే గుర్తించింది. దీనికి అనుగుణంగా విస్తృతంగా అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని సూచించింది. ఈపీడీసీఎల్ అధికారులతో పాటు సోలార్ ప్యానెళ్ల వెండర్లను భాగస్వాములను చేయాలనేది ప్రభుత్వ ఉద్దేశం. కానీ ఈ దిశగా ప్రయత్నాలు చేసిన దాఖలాలు కనిపించలేదు

పెట్టుబడి వద్దే వెనుకడుగు..

నెలకు 120 యూనిట్ల విద్యుత్ ఉపయోగించే వారికి కిలో వాట్ సోలార్ యూనిట్ ఏర్పాటు చేసుకునేలా మార్గదర్శకాలు రూపొందించారు. ఈ యూనిట్‌కు మొత్తం రూ.60 వేలు ఖర్చు అవుతుండగా రూ.30 వేలు రాయితీ రూపంలో లబ్ధిదారులకు అందుతుంది. అలా యూనిట్ల వినియోగం పెరిగే కొద్ది... కిలోవాట్ల లెక్కన రాయితీలిస్తోంది. ఈ మొత్తం ప్రక్రియలో రాయితీ పోనూ.. మిగిలిన మొత్తం పెట్టే ఖర్చు అధికంగా ఉండడం వల్లే గృహ యజమానులు సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుకు వెనకడుగు వేస్తున్నారు. సోలార్ రూఫ్‌టాప్‌ల ఏర్పాటుతో.. 20 ఏళ్ల పాటు కరెంటు బిల్లులు చెల్లించనవసరం ఉండదనే విషయాన్ని వినియోగదారులకు చేరువ చేయడంలో యంత్రాంగం వైఫల్యం కూడా ఇక్కడ కనపడుతోంది. సోలార్ ప్యానెళ్లు ఈదురుగాలులు వచ్చి దెబ్బతింటే అందించే సర్వీసు పైనా స్పష్టత లేదు.

మూడు జిల్లాల పరిధిలో 6 వేల లోపే

పీఎం సూర్యఘర్ పథకం గడువు 2025-26 ఆర్థిక సంవత్సరం వరకేనని కేంద్రం ప్రకటించింది. కానీ, మరో ఏడాది గడువు పొడిగించారని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాల ప్రకారం వచ్చిన దరఖాస్తుల్లో 40 శాతం ఇళ్లకు ఇప్పటికే సోలార్ రూఫ్‌టాప్‌ల ఏర్పాటు పూర్తి కావాల్సి ఉంది. అంటే మూడు జిల్లాల పరిధిలో 20 వేల ఇళ్లకు సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. కానీ క్షేత్రస్థాయి గణాంకాలు ఇందుకు విరుద్ధంగా ఉన్నాయి. బాపట్ల జిల్లాలో కేవలం 1,600 ఇళ్లకే సోలార్ రూఫ్‌టాప్‌లు అమర్చగా గుంటూరు, పల్నాడు జిల్లాలు కలిపి ఈ సంఖ్య 4,400గా ఉంది.

పోక్సో కేసులో నిందితుడికి జీవితఖైదు

గుంటూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసు నిందితుడికి జీవిత ఖైదు, రూ.పది వేల జరిమాన విధిస్తూ పోక్సో కోర్టు న్యాయమూర్తి షమ్మీ పర్వీన్ సుల్తానా బేగం తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళితే.. పొన్నూరులోని వల్లభరావుపాలెం గ్రామానికి చెందిన మహిళ కూతురు, మనవరాళ్లతో ఉంటోంది. 2014 జూలైలో రాత్రి ఆరుబయట ఆడుకుంటున్న ఆమె పెద్ద మనువరాలిని(13) స్థానికంగా ఉండే మద్దసాని సురేంద్ర (32) అనే వ్యక్తి ఇంటికి దగ్గరలోని ఓ డాబా మీదకు తీసుకెళ్లాడు. అక్కడ బాలికపై అత్యాచారయత్నం చేశాడు. ఆ సమయంలో బాలిక అరుపులు విని.. చుట్టుపక్కల వాళ్లు డాబాపైకి చేరుకున్నారు. వారిని చూసి నిందితుడు సురేంద్ర అక్కడ నుంచి పారిపోయాడు. బాధితురాలు పొన్నూరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. కేసు పూర్వాపరాలు, సాక్ష్యాధారాలను పరిశీలించిన గుంటూరు పోక్సో కోర్టు న్యాయమూర్తి షమ్మీ పర్వీన్ సుల్తానా బేగం నిందితుడిని దోషిగా తేల్చి.. జైలు శిక్ష, జరిమానా విధించారు. నిందితుడికి శిక్ష పడటంలో సహకరించిన దర్యాప్తు అధికారి సీఐ వీరయ్య, పబ్లిక్ ప్రాసిక్యూటర్ బర్కత్ అలీ ఖాన్, కోర్టు మానిటరింగ్ సెల్ సీఐ నరసింహారావు, పోక్సో కోర్టు హెడ్ కానిస్టేబుల్ ప్రకాశరావు, కోర్టు కానిస్టేబుల్ వెంకటేశ్వరరావును జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అభినందించారు.

80 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం స్వాధీనం

వట్టిచెరుకూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): అనంతవరప్పాడు గ్రామంలోని శ్రీవల్లి రైస్ మిల్లులో పీడీఎస్ బియ్యం నిల్వలపై ఆదివారం అధికారులు దాడులు నిర్వహించారు. సోమవారం డీఎస్‌వో చంద్రమని సమక్షంలో సీఎస్‌డీటీ శివశంకర్ బియ్యం నిల్వల లెక్క తేల్చారు. 80 క్వింటాళ్ల బియ్యం నిల్వ చేసినందుకు క్రిమినల్ కేసు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు. 2,268 బస్తాల బియ్యంలో 2,108 బస్తాలకు రసీదులు చూపించగా.. మిగిలిన 120 బ్యాగుల్లోని 80 క్వింటాళ్ళ బియ్యాన్ని సీజ్ చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో.. ఆపరేషన్ సిందూర్ జవాన్ మృతి

కుమారుడు కూడా మృతి.. వరగానిలో విషాద ఛాయలు



నాగేశ్వరరావు (పాత చిత్రం)

పెదనందిపాడు, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వరగాని గ్రామానికి చెందిన ఆర్మీలో సుబేదారుగా పనిచేస్తున్న ఉదయగిరి నాగేశ్వరరావు(45), కుమారుడు వెంకట అవినాష్(22) రోడ్డు ప్రమాదంలో సోమవారం మృతిచెందారు. స్థానికుల కథనం మేరకు.. సుబేదార్ నాగేశ్వరరావు సెలవుపై ఇంటికి బయలు దేరారు. కారులో కుటుంబ సభ్యులతో కలిసి స్వగ్రామానికి వస్తున్నారు. ఈ క్రమంలో నల్గొండ సమీపంలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు కుమారుడితో కలిసి కారు దిగారు. ఈ క్రమంలో ఒక్కసారిగా మృత్యువు రూపంలో వచ్చిన లారీ వారిని ఢీకొట్టింది. దీంతో అవినాష్ అక్కడికక్కడే మృతిచెందగా, నాగేశ్వరరావు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారు. నాగేశ్వరరావు ఇటీవల భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో పాల్గొన్నారు. చిరునవ్వుతో ఇంటికి రావాల్సిన తండ్రీ కొడుకులు.. విగతజీవులుగా మారడం తో స్వగ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

ప్రభుత్వ వృత్తి విద్యా కళాశాల ప్రిన్సిపాల్‌గా ముంతాజ్

గుంటూరు (విద్య), జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బాలికల వృత్తి విద్యా జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఎస్‌కే ముంతాజ్‌ను నియమిస్తూ ఇంటర్ బోర్డు అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సత్తెనపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇప్పటిదాకా ఆమె ప ని చేశారు. తాజాగా ఇంటర్ బోర్డు గుంటూరులోని ప్రభుత్వ బాలికల వృత్తి విద్య జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా అధ్యాపకు లు నూతన ప్రిన్సిపాల్ ముంతాజ్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.90 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	106, 114, 125
చికెన్ విత్ స్కిన్(కిలో)	204.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	214.00

40,524 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 43,233 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 40,524 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 6,459 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	9600	11000
334	9500	12700	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	13200	334	9500	12800
273	10000	12500	నెంబరు. 5	10000	13200
341	10000	13400	341	10000	13300
సూపర్ 10	--	--	4884	10000	12600
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			273	9800	12400
తేజ	10000	13600	**ఏసీ స్పెషల్ వెరైటీ**		
షార్క్-1	---	---	తేజ	10000	13300
బ్యాడిగి 355	10000	12500	బ్యాడిగి 355	10000	12500
సింజెంటా బ్యాడిగి	--	---	దేవనూరు డీలక్స్	10000	12300
దేవనూరు డీలక్స్	10000	12400	తాలుకాయలు	4700	7000



గర్నెపూడిలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సంవత్సర కాలంలో సుపరిపాలన

ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): సంవత్సర కాలంలో కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ఎంతో అభివృద్ధి, సంక్షేమాన్ని చేసిందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని గర్నెపూడిలో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ సంక్షేమంతో పాటు అభివృద్ధి ఉంటేనే రాష్ట్రం ముందుకు వెళ్తుందన్నారు. సుపరిపాలన ద్వారా ఇంటింటికి రెట్టింపు సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఎన్నికల హామీలను నెరవేరుస్తుందన్నారు. ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడారు. ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా?, లేదా? అని అడిగి తెలుసుకున్నారు. కరపత్రాలను కన్నా పంపిణీ చేశారు. గర్నెపూడిలో ఉన్న ఎన్టీఆర్, డాక్టర్ కోడెల విగ్రహాలకు పూలమాలలు వేసి ఆయన నివాళులర్పించారు. ప్రజల సమస్యలు తెలుసుకొని పై టీడీపీ యాప్‌లో కన్నా స్వయంగా నమోదుచేశారు. ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కూటమి మండల, జిల్లా, రాష్ట్రస్థాయి నాయకులు ఉన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న సీఐటీయూ, మున్సిపల్ కార్మికులు

మున్సిపల్ కార్మికుల బైక్ ర్యాలీ

పిడుగురాళ్ల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 9వ తేదీన నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ పిడుగురాళ్లలో సీఐటీయూ, మున్సిపల్ కార్మికులు బైక్ ర్యాలీ నిర్వహించారు. మోదీ పాలనలో కార్పొరేట్ సంస్థలకే ఆదాయం సమకూర్చేలా కట్టబెడుతున్నాడని, కార్మికుల హక్కులను కాలరాసే విధానాలను అమలు చేస్తున్నారని సీఐటీయూ మండల కార్యదర్శి తెలగపల్లి శ్రీను తెలిపారు. నిరుద్యోగ సమస్య పెరిగిపోయి దేశ అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ర్యాలీలో విజయ్, మధు, పూర్ణ, వేములు శ్రీను, ప్రతాప్, నాగేశ్వరరావు, బాబు, మహ్మద్, యూసుఫ్, రాజు, అనిల్, తిరుపతిరావు, రాగిడి శ్రీను, మోహన్, రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఏఐఎఫ్‌టీయూ నాయకుల ఆధ్వర్యంలో పిడుగురాళ్లలో నిరసన కార్యక్రమం చేపట్టారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా 9వ తేదీన జరుగనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని నాయకులు కొండారెడ్డి చెన్నయ్య, నీలాద్రి రాంబాబు, కృష్ణ, కోటయ్య, పుల్లమ్మ, కోటేశ్వరమ్మ, అక్కమ్మ, వెంకటేశ్వర్లు తదితరులు కోరారు.

బాలయ్యకు ఘన సన్మానం

దాచేపల్లి, జూలై 7(ఆంధ్రజ్యోతి): గత 55 సంవత్సరాలుగా దాచేపల్లి మండలంలో పోతులూరి బ్రహ్మంగారి భక్త సమాజం సంఘాన్ని ఏర్పాటుచేసి గ్రామాల్లో నాటకాలు, పౌరాణిక, జానపద డ్రామాలు నిర్వహించి కళాకారులను తయారు చేయటంతో పాటు కళాభివృద్ధికి విశేషంగా పాటుపడిన నూకన బాలయ్య(97), ఈశ్వరమ్మల వృద్ధ దంపతులను కళాకారులు ఘనంగా సన్మానించారు. తక్కెళ్ళపాడు గ్రామానికి చెందిన బాలయ్య డోలక్, కోలాటం మాస్టారుగా పల్నాడు ప్రాంతంలో కృషి చేస్తున్నారు. వయో భారంతో ఉన్నప్పటికీ కూడా నేటికి తన వంతుగా భజనా కార్యక్రమాలకు రావటానికి ముందుంటాడు. సోమవారం జరిగిన సన్మాన సభలో తక్కెళ్ళపాడు గ్రామానికి చెందిన బ్రహ్మశ్రీ బల్లి లక్ష్మీ నారసింహ శర్మ కళాకారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ద్రోణాదుల శంకరరావు, సర్పంచ్ కిష్టంశెట్టి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌లో మూడు దరఖాస్తులు

ముప్పాళ్ళ జూన్ 30(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కారవేదికకు మూడు దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ నగేష్ తెలిపారు. తమ భూముల ఆన్‌లైన్, ఇతర సమస్యల కొరకు ముగ్గురు దరఖాస్తు చేసుకున్నట్లు తహసీల్దార్ అన్నారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం సోమవారం నాటికి 529.10 అడుగులు ఉంది. ఇది 166.39 టీఎంసీలకు సమానం. ఎడమ కాలువ ద్వారా 3374 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ 1350, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 4724 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు ఇన్‌ఫ్లోగా 58,780 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల...

అచ్చంపేట, జూలై 7(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో సోమవారం 15.89 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. పవర్ జనరేషన్ ద్వారా 6,600 క్యూసెక్కులు, లీకుల ద్వారా 400, మొత్తం 7వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

కౌలు రైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకాన్ని అందించాలి

పెదకూరపాడు, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : కౌలు రైతులందరికీ అన్నదాత సుఖీభవ పథకాన్ని అందించాలని కోరుతూ తహసీల్దార్ నీలి ధనలక్ష్మికి వినతి పత్రం అందించారు. రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో దర్శి శేషారావు, కంచర్ల జాన్ బాబు, ఎం మస్తాన్‌రావు, కే సుబ్బారావు, షేక్ జానీ, వీరయ్య, జీవన్ తదితరులు ఉన్నారు.



ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం

● ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

దుర్గి, జూలై 7(ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాలు అందించడంతోపాటు రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని కంచరగుంట, కోలగుట్ల గ్రామాల్లో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో తాగునీరు, సీసీరోడ్లు, వీధిదీపాల వంటి మౌలిక వసతులు కల్పించామన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం అభివృద్ధిలో 20 ఏళ్ల వెనక్కు వెళ్లిందని, రాష్ట్రాన్ని అప్పులకుప్పగా చేశారన్నారు. ప్రశ్నించే వారిపై దాడులు చేయడం, అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేయడం తప్ప అభివృద్ధి చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు రాష్ట్రాన్ని ఎంతగానో అభివృద్ధి చేశారన్నారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తెస్తే త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ యేచూరి సునీతా శంకర్, జానకి రామయ్య, లింగా రమేష్, మాగులూరి నారయ్య, మేకల దాసు, వంకమళ్ల కోటేశ్వరరావు, గరిణె రమేష్, లింగా పుల్లయ్య, డి.చెన్నయ్య, కె.రామారావు, ఎం.గోపాల్, వి.శ్రీనివాసరావు, ఆదినారాయణ, మహేష్, కూటమినేతలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహరం వేడుకలు

దాచేపల్లి, జూలై 7(ఆంధ్రజ్యోతి): సమైక్యతకు ప్రతీకగా నిలిచే మొహరం పర్వదినాన్ని హిందూ ముస్లింలు ప్రశాంతంగా జరుపుకున్నారు. పీర్ల పండుగ సందర్భంగా దాచేపల్లిలో కుల, మతాలకు అతీతంగా ఆడపిల్లలను ఇళ్లకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా పీర్లను ప్రత్యేకంగా పుర వీధుల్లో ఊరేగిస్తారు.

మాచవరం మండలంలో...

మాచవరం, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం మొహరం వేడుకలు ఘనంగా నిర్వహించారు. కుల, మతాలకు అతీతంగా జరుపుకొనే ఈ వేడుకలను మాచవరం, తురకపాలెం, వేమవరం, రేగులగడ్డ, పిన్నెల్లి, గంగిరెడ్డిపాలెం, మోర్జంపాడు, పిల్లుట్ల, శ్రీరుక్మిణీపురం పీర్ల చావిడిల్లో నిర్వహిస్తున్నారు.



మాచవరం: వేమవరంలో పీర్లు ఊరేగిస్తున్న దృశ్యం



రాజుపాలెం: రెడ్డిగూడెంలో వేడుకలు నిర్వహిస్తున్న ముస్లింలు

చివరి రోజున ఆయా గ్రామాల వీధుల్లో పీర్ల ఊరేగింపు జరిపి రాత్రికి బావుల్లో నిమజ్జనం పూర్తి చేశారు.

పిడుగురాళ్ల మండలంలో...

పిడుగురాళ్ల, జూలై 7(ఆంధ్రజ్యోతి): మొహర్రం పండుగను పురస్కరించుకొని పిడుగురాళ్ల, జానపాడు, గుత్తికొండ, కరాలపాడు, జూలకల్లు, తుమ్మలచెరువు, బ్రాహ్మణపల్లి గ్రామాలలో సోమవారం వేడుకలు జరిగాయి. ఆయా గ్రామాలలోని పీర్లచావిడి వద్ద పండుగ నిర్వహించి పీర్లను ఊరేగించారు. ఈ సందర్భంగా ముస్లింలు పెద్దఎత్తున హాజరయ్యారు.

రాజుపాలెం మండలంలో...

రాజుపాలెం, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని రెడ్డిగూడెం, ఇనిమెట్ల, ముక్కపాడు, గ్రామాలలో పీర్ల పండుగను ఆయా గ్రామాల ముస్లింలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పీర్ల చావిడి వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పీర్లను ఊరేగింపు చేశారు.చావిడిలను విద్యుద్దీపాలంకరణతో ముస్తాబు చేశారు. కార్యక్రమంలో యువత అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నకరికల్లు మండలంలో...

నకరికల్లు, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : పీర్ల పండుగను పురస్కరించుకొని కుంకలగుంట్ల, గుండ్లపల్లి, నకరికల్లు, చాగల్లు గ్రామాల్లో ముస్లింలు పీర్లను ఊరేగిస్తూ పండుగను జరుపుకున్నారు. పూర్వీకుల త్యాగాలను గుర్తు చేసుకొని మొహరం విశిష్టతను మత పెద్దలు బోధించారు. ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొని మొహరం వేడుకలను జరుపుకున్నారు.

క్రోసూరు మండలంలో...

క్రోసూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం మొహరం వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. దొడ్లేరులో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పాల్గొని పీర్లకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. హసానాబాద్‌లో మొహరం సందర్భంగా జరిగిన తిరునాళ్ళ కార్యక్రమంలో పాల్గొన్నారు.



మాచర్లలో పీర్లను ఊరేగిస్తున్న ముస్లింలు



క్రోసూరు: వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

బెల్లంకొండ మండలంలో...

బెల్లంకొండ, జూలై 7(ఆంధ్రజ్యోతి): బెల్లంకొండలో మొహరం వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం పీర్ల చావిడిల వద్దకు భారీగా ప్రజలు తరలివెళ్ళి పీర్లను నిమజ్జనానికి తరలించారు. వన్నాయపాలెం, న్యాచిట్యాల ఆర్అండ్ఆర్ సెంటర్, పాపాయపాలెం, వెంకటాయపాలెం, చంద్రాజుపాలెం, కందిపాడు గ్రామాల్లో వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.



హసానాబాద్‌లో ఇంటింటికి తిరిగి కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్

సుపరిపాలన అందించి ప్రజల వద్దకు వెళ్తున్నాం

● ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

క్రోసూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఏడాదికాలంలో సుపరిపాలన అందించిన తరువాతనే ప్రజల వద్దకు గర్వంగా వెళ్తున్నామని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. సోమవారం మండలంలోని హసానాబాద్‌లో, దొడ్లేరులో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి కరపత్రాలను అందజేశారు. సమస్యలను అడిగి తెలుసుకొని మై టీడీపీ యాప్‌లో నమోదు చేశారు. వృద్ధులు, మహిళల యోగక్షేమాలు తెలుసుకొని ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా? లేదా? అని విచారించారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. రాష్ట్ర పునర్నిర్మాణం కోసం చంద్రబాబు చేస్తున్న కృషికి ప్రజలకు అండగా నిలబడాలన్నారు. టీడీపీ నాయకులు ఈపూరి నాగేశ్వరరావు, వెన్నా సాంబశివారెడ్డి, మొగల్ జాన్, బండారు మైనూర్ బాబు, లేళ్ళ వెంకటరావు, నలజాల కోటేశ్వరరావు, హసానాబాద్, షేక్ బడా, వేగుంట రాణి, అనుముల వెంకట రామిరెడ్డి, నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ యర్రంశెట్టి రామకృష్ణ పాల్గొన్నారు.



అచ్చంపేట: తాడువాయిలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో టీడీపీ నాయకులు

తాడువాయిలో సుపరిపాలన తొలి అడుగు

అచ్చంపేట, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాడువాయి గ్రామంలో సోమవారం సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం జరిగింది. సంవత్సర కాలంలో ఎన్నికల వాగ్దానాలను అమలుచేసి సంక్షేమం, అభివృద్ధిని కూటమి ప్రభుత్వం కొనసాగిస్తుందని, పథకాల గురించి ఇంటింటికి ప్రచారం చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, గ్రామ నాయకులు మూడావత్ బాలూనాయక్, డీసీ చైర్మన్ పసుపులేటి పాపిరెడ్డి, ఏపూరి రమేష్, మల్లెల సింహరాయలు, కోట చంటి, బత్తుల గోపీ, అన్నవరపు శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.



పెదకూరపాడు: పొడపాడు గ్రామంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న మండల టీడీపీ అధ్యక్షుడు బ్రహ్మయ్య

టీడీపీతోనే సుపరిపాలన సాధ్యం

పెదకూరపాడు, జూలై 7(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీతోనే రాష్ట్రంలో సుపరిపాలన సాధ్యమని టీడీపీ మండల అధ్యక్షుడు ఏటుకూరి బ్రహ్మయ్య అన్నారు. మండలంలోని పొడపాడు, ముస్సాపురం గ్రామాల్లో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బ్రహ్మయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో చేపట్టిన సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు అర్తిమళ్ళ రమేష్, మాజీ ఎంపీపీలు బెల్లంకొండ రామగోపాలరావు, గల్లా బాబూరావు, తెలుగు రైతు జిల్లా ప్రధాన కార్యదర్శి భాష్యం ఆంజనేయులు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు, మక్కెన సాగర్, ఏటుకూరి సురేష్, గంగినేని లీలావతి, షేక్ ముంతాజ్, కాసరబాద హనుమంతరావు, కావూరి సుజాత, కఠారి శ్రీను, సరిపూడి కృష్ణ కుమారి, షేక్ ఖాశిం సాహెబ్, నాదెండ్ల కల్పన పాల్గొన్నారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న ధారునాయక్

ఆశ్రమ పాఠశాలను సందర్శించిన ధారునాయక్

మాచర్ల రూరల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎత్తిపోతలలో గల ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలను సోమవారం టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం ధారునాయక్ సందర్శించారు. విద్యార్థినులకు అందుతున్న సౌకర్యాలను ప్రిన్సిపాల్ దుర్గా భవానిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పాఠశాలలో చదివే విద్యార్థినులు మంచి ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థినులతో మాట్లాడారు. ప్రభుత్వం అందించే పథకాలను విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థినులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఆయన వెంట ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు గుండ్లా నాయక్, పాండునాయక్, వెంకటేశ్వర్లు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

10న పేరెంట్ - టీచర్ సమావేశం

గురజాలటౌన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈనెల 10వ తేదీన పేరెంట్ - టీచర్ సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఉప్పల రవి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ సమావేశంలో విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొనాలని కోరారు.

ఆధారు మార్పు, చేర్పుల్లో పోస్టాఫీసులో అదనపు వసూళ్లు

● జనసేన నియోజకవర్గ నేత ప్రసాదరావు

మాచర్ల రూరల్, జూలై 7(ఆంధ్రజ్యోతి): ఆధార్ మార్పుల్లో పోస్టాఫీసులో ప్రభుత్వ నిర్దేశిత రుసుం కన్నా రూ.100 అదనపు ఛార్జీ వసూలు చేస్తున్నారని జనసేన నియోజకవర్గ అధికార ప్రతినిధి నక్షత్రపు ప్రసాదరావు ఆరోపించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆధార్ కార్డులో మార్పులు, చేర్పుల కోసం పట్టణంలో టెలిఫోన్ ఎక్స్చేంజ్, బ్యాంకు, పోస్టాఫీసులలో ప్రజలకు అవకాశం కల్పించిందన్నారు. పోస్టాఫీసులో అదనపు వసూళ్లను ప్రశ్నించిన వారితో అన్ని చోట్లా అలాగే తీసుకుంటున్నారు.. తమకూ అలాగే చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారన్నారు. దీనిపై ప్రభుత్వం విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రసాదరావు వెంట షేక్ అబ్దుల్ షరీఫ్, బార్లపూడి మల్లికార్జునరావు, సంకూరి నరసింహారావు తదితరులు ఉన్నారు.

సూపర్ సిక్స్ పథకాలు అమలు



పిడుగురాళ్లలోని 9వ వార్డులో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో యరపతినేని నిఖిల్, పార్టీ నేతలు

పిడుగురాళ్ల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను పార్టీ పరంగా చంద్రబాబు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నట్లు గురజాల ఎమ్మెల్యే యరపతినేని తనయుడు సాయినిఖిల్ తెలిపారు. సోమవారం పట్టణ పరిధిలోని 8, 9 వార్డులలో సుపరిపాలన తొలి అడుగు ఇంటింటికి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిఖిల్ ఇంటింటికి వెళ్లి ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం అందించిన పథకాలను వివరించారు. పట్టణంలో రాబోయే నాలుగు నెలల్లో ప్రతి వార్డుకు కేటాయించిన రూ.15 లక్షల నిధులతో అభివృద్ధి పనులు పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో పాండురంగ శ్రీను, వడ్డవల్లి సర్వేశ్వరరావు, తురకా వీరస్వామి, కనిగిరి శ్రీను, అమీర్‌అలీ, ఎల్వీఆర్, కోట హరి, బొల్లా శ్రీను, జొన్నలగడ్డ శ్రీను, బండ్ల భాస్కర్, వల్లెపు రామకృష్ణ, తదితరులున్నారు.

శ్రేష్ఠ పరీక్షల్లో మోడల్ స్కూల్ విద్యార్థి ప్రతిభ



విద్యార్థి రిషి రాజేష్

కారంపూడి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి ప్రతిష్ఠాత్మక మూల్యాంకన సంస్థ ఎన్‌టీఏ నిర్వహించే పరీక్షల్లో ఒకటైన శ్రేష్ఠ నిర్వహించిన పరీక్షల్లో కారంపూడి మోడల్ స్కూల్ విద్యార్థి కె.రిషి రాజేష్ 977 జాతీయ స్థాయి ర్యాంకు సాధించినట్లు ప్రిన్సిపాల్ నయోమి తెలిపారు. షెడ్యూల్ కులాల విద్యార్థులను నాలుగేళ్లపాటు ఉచితంగా అంటే 9వ తరగతి నుంచి ఇంటర్ వరకు జాతీయస్థాయి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో ఉచితంగా చదువుకునేందుకు అవకాశం ఉందన్నారు. ఈ సందర్భంగా రిషి రాజేష్‌ను సోమవారం ప్రిన్సిపాల్ నయోమి, ఉపాధ్యాయులు అభినందించారు.

దుర్గంధంగా చేద బావి నీరు

రెంటచింతల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రెంటచింతలలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయ సమీపంలోని బ్రాహ్మణ వీధిలో చేద బావి నీరు రంగు మారి దుర్గంధం వెదజల్లుతోంది. ఆ బావి నిండా మోటార్లు వున్నాయి. బావిలో వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. ఈ నీళ్లనే ప్రతి రోజు 25 కుటుంబాలు వారు వాడుకుంటున్నారు. పంచాయతీ అధికారులు ఈ నీటిని శుద్ధి చేయకుంటే ప్రజలు అనారోగ్యం పాలయ్యే ప్రమాదం ఉంది.



చేద బావిలో రంగు మారిన నీరు

ఏడుకొండలు మృతి పార్టీకి తీరని లోటు

బెల్లంకొండ, జూలై 7(ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకుడు ఏడుకొండలు మృతి టీడీపీకి తీరని లోటని రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్‌షరీఫ్ పేర్కొన్నారు. సోమవారం మండలంలోని వెంకటాయపాలెం గ్రామంలో ఏడుకొండలు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మట్టి ఖర్చుల నిమిత్తం రూ.10వేల ఆర్థిక సాయాన్ని కుటుంబసభ్యులకు అందజేశారు. సంతాపం ప్రకటించిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు నల్లమేకల లక్ష్మీనారాయణ, అక్కుల వెంకటరామిరెడ్డి, బొర్ల వెంకటేశ్వర్లు, శ్రీను నాయక్, మేళం శ్రీరామమూర్తి, యలమంద, బెల్లంకొండ సర్పంచ్ జ్యోతిసముద్రం ఉన్నారు.



మాచర్ల: కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి



పిడుగురాళ్ల: ఎమ్మార్పీఎస్ జెండా ఎగురవేస్తున్న నేతలు

మాదిగ హక్కుల కోసం పోరాడిన మందకృష్ణ

● ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, జూలై 7(ఆంధ్రజ్యోతి): మాదిగల హక్కుల కోసం పోరాడిన వ్యక్తి మందకృష్ణ మాదిగ అని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని పార్కు సెంటర్లో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యాన నిర్వహించిన మందకృష్ణ జన్మదిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం కేక్‌ను కట్‌చేశారు. కార్యక్రమంలో పంగులూరి పుల్లయ్య, మున్సిపల్ చైర్మన్ షేక్ మదార్‌సాహెబ్, కొమెర దుర్గారావు, మోసిన్, వెంకట్రామిరెడ్డి, పి.పుల్లారావు పాల్గొన్నారు.

● దుర్గి, జూలై 7(ఆంధ్రజ్యోతి): దుర్గిలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ఎండూరి నాగరాజు ఆధ్వర్యాన ఆవిర్భావదినం, మందకృష్ణ మాదిక జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా ఉపాధ్యక్షుడు కందుకూరి రమేష్ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో భుజంగరావు, ఇ.శ్యామ్, మాణిక్యరావు, బి.అజయ్, అభిషేక్, అమర్, విజయ్, చందు, ప్రకాష్, ఆశాదీప్, అజయ్, లక్ష్మణ్, కోటేశ్వరరావు, సాగర్ పాల్గొన్నారు.

● పిడుగురాళ్ల, జూలై 7(ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్లలో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద జెండాను నాయకులు ఆవిష్కరించారు. మాదిగ ఉద్యోగుల సమాఖ్య నాయకులు వంగూరి అశోక్, కారసాల విజయబాబుతోపాటు పలువురు నేతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎం.సాగర్, సుశీల, ఇస్రాయేలు, యాకోబు, చిన్ని, ఆనంద్, నాగేశ్వరరావు పాల్గొన్నారు. తుమ్మలచెరువులో జెండాను నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎం.బాబు ఆవిష్కరించారు. కార్యక్రమంలో బి.సుందరరావు, ఆలేటి సురేష్‌బాబు, వెంకయ్య, అంకారావు పాల్గొన్నారు.

● అచ్చంపేట, జూలై 7(ఆంధ్రజ్యోతి): అచ్చంపేటలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బుర్రి కిరణ్‌బాబు ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ఏసుపోగు నాగయ్య, సందెపోగు వెంకటరావు, ఎస్.మహేష్, తాళ్ళూరి రాంబాబు, కోట చంటి, వి.కాటయ్య, వి.లక్ష్మయ్య, మేదర లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

● మాచర్ల రూరల్, జూలై 7(ఆంధ్రజ్యోతి): విజయపురిసౌత్‌లో ఎంఎస్‌పీ ఊరే మార్కు ఆధ్వర్యాన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ విజయపురిసౌత్ అధ్యక్షుడు బొల్లా వెంకటేశ్వర్లు చౌదరి, నీలం బసవేశ్వర రెడ్డి, ఎం.రామాంజినేయులు, పి.సత్యనారాయణ, వంగవరపు పవన్, పాలికి బాలస్వామి, ఆడెపు కోటయ్య, బీ నాగేశ్వరరావు, పాల్గొన్నారు.

● రెంటచింతల, జూలై 7(ఆంధ్రజ్యోతి): రెంటచింతలలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్‌చేశారు. కార్యక్రమంలో జి.శ్రీనివాసరావు, పెదసామ్యేలు, ఐజాక్, ఇసాక్, జక్రయ్య, సిల్వరాజ్, దానయ్య, శేఖర్, వెంకయ్య పాల్గొన్నారు.

● కారంపూడి, జూలై 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఒప్పిచర్లలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. జెండాను ఎంఎస్‌పీ జిల్లా ఇన్‌చార్జి కోటేశ్వరరావు ఎగురవేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తాళ్లూరు జీవరత్నం, టీడీపీ ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు ముత్తయ్య, కాల్వ పేరయ్య పాల్గొన్నారు.



విజయపురిసౌత్‌లో వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం



దుర్గిలో వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు



రెంటచింతల: కేక్ కట్ చేస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

బడి బస్సు భద్రతపై.. ప్రశ్నలెన్నో!

- ఫిట్నెస్ పరీక్షలు తొలిసారిగా ప్రైవేటుకు అప్పగింత
- ఏ పరీక్షలు నిర్వహించారో తెలియని పరిస్థితి
- ప్రారంభం కాని రవాణాశాఖ తనిఖీలు
- బస్సుల సామర్థ్యంపై తల్లిదండ్రుల ఆందోళన

ప్రైవేట్ విద్యా సంస్థల బస్సుల సామర్థ్యంపై అనేక ప్రశ్నలు పుట్టుకొస్తున్నాయి. ఈ ఏడాది వాటి ఫిట్‌నెస్ పరీక్షల బాధ్యతను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించారు. ఎఫ్‌సీ (ఫిట్‌నెస్ సర్టిఫికెట్) జారీలో అసలు పరీక్షల నిర్వహణపైనే పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ప్రైవేట్ ఏజెన్సీల వద్ద కూడా దళారులు పాగా వేయడం ఇందుకు ప్రధాన కారణం. అధికారులు తనిఖీలు నిర్వహిస్తే.. ప్రైవేట్ స్కూళ్ల బస్సుల భద్రత ఏమాత్రం అనేది తేలుతుందని తల్లిదండ్రులు కోరుతున్నారు.

గుంటూరు(తూర్పు), జూలై 7(ఆంధ్రజ్యోతి): కొత్త విద్యా సంవత్సరం మొదలై దాదాపు 25 రోజులు గడుస్తోంది. విద్యాసంస్థల బస్సుల ఫిట్నెస్ పరీక్షలు, తనిఖీలు మాత్రం వేగంగా జరగడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఏటా మే మొదటి వారం నుంచి జూన్ ఆఖరి వరకు ఫిట్నెస్ పరీక్షలు జరుగుతాయి. ఎనిమిదేళ్ల లోపు సర్వీసులో ఉన్న విద్యా సంస్థల బస్సులు రెండేళ్లకు, ఆ పైబడి సర్వీసు ఉన్న బస్సుకు ఏటా ఫిట్నెస్ పరీక్షలు చేయించుకోవాలి. ఈ విధానాన్ని ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించడంతో ఎన్ని బస్సులకు ఫిట్నెస్ పరీక్షలు నిర్వహించారో అనే విషయం తెలియడం లేదు.

ప్రైవేటు ఏజెన్సీపై ఆరోపణలు

విద్యా సంస్థల బస్సుల ఫిట్నెస్ పరీక్షలు ఈ ఏడాది ప్రైవేటు ఏజెన్సీకి అప్పగించారు. స్థానిక గుంటూరులోని అనంతవరప్పాడు రోడ్డులో ఈ సంస్థ కార్యాలయం ఏర్పాటు చేసి, పరీక్షలు నిర్వహిస్తోంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎఫ్‌సీ కావాలంటే సీటింగ్ కెపాసిటీని బట్టి ప్రతి బస్సు రూ.1,500 నుంచి రూ.3వేలు చలాన ప్రభుత్వానికి చెల్లించాలి. ఇతరత్రా మరమ్మతులు, రేడియం స్టిక్కర్లు యాజమాన్యమే భరించాలి. ఈ ఏజెన్సీ వద్ద దళారులు పాగా వేశారు. ఏజెన్సీతో ఒప్పందం చేసుకుని ప్రతి స్కూల్ యాజమాన్యం నుంచి రూ.2 వేల నుంచి రూ.3వేలు వరకు అదనపు వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏజెంటు ద్వారా వెళితేనే దాదాపు వాహనాలన్నీ ఫిటినెస్ పాస్ అవుతున్నాయని విమర్శలు వస్తున్నాయి. నేరుగా వెళితే ఆటోమేటెడ్ మిషన్ ద్వారా కాకుండా మాన్యువల్ చేసే కొన్ని నిబంధనల్లో ఏదో ఒక కొర్రీ పెట్టి.. వెనక్కి పంపుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

డ్రైవర్ల విషయంలో నిబంధనలు

- డ్రైవర్‌కు 60 ఏళ్లు మించకూడదు.
- బస్సు డ్రైవింగ్‌లో ఐదేళ్ల అనుభవం ఉండాలి.
- డ్రైవరు నియామకాన్ని.. పేరెంట్స్ కమిటీకి తెలపాలి.
- బస్సు డ్రైవరు, అటెండర్ యూనిఫాం ధరించాలి.
- డ్రైవర్లకు బ్రీత్ ఎనలైజర్ పరీక్షలు నిర్వహించాలి

20 శాతం పెరిగిన బస్సు చార్జీలు

ఇది ఇలా ఉంటే స్కూల్ బస్సుల చార్జీలు మాత్రం ఈ ఏడాది ఒక్కసారిగా 20 శాతంపైనే పెంచారు. కొన్ని పాఠశాలల్లో అయితే స్కూల్ ఫీజుల కంటే బస్సు ఫీజులే అధికంగా ఉన్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రారంభం కాని తనిఖీలు

బడి బస్సుల తనిఖీలు జిల్లాలో ఇంతవరకు ప్రారంభం కాలేదు. మిగిలిన జిల్లాలో తనిఖీలు ప్రారంభించి, నిబంధనలు పాటించని బస్సులపై కేసులు నమోదు చేస్తున్నారు. వాస్తవానికి నూతన విధానంలో ప్రైవేట్ ఏజెన్సీలు ఎఫ్‌సీ జారీ చేస్తున్న సమయంలో అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలి. లోపాలు గమనిస్తే వాటిని తిరిగి ఏజెన్సీకి పంపాలి. కానీ, ఈ ప్రక్రియ ముందుకు సాగడం లేదు. మరోవైపు ఏజెన్సీలు జారీ చేసిన సర్టిఫికెట్లు మోటారు వాహన తనిఖీ అధికారులు ఆమోదం తెలుపుతారా లేదా అని విద్యాసంస్థల యాజ మాన్యాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

కాల్లం చెల్లిన బస్సుల సంగతేంటి?

కాలం చెల్లిన బస్సులను రోడ్లపైన తిప్పవద్దని ప్రభుత్వం స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. కానీ, ఈ ఆదేశాలను విద్యా సంస్థల యాజమాన్యాలు బేఖాతరు చేస్తున్నాయి. సగం బస్సులను నిబంధనలకు అనుగుణంగా ఉంచి, మిగిలిన వాటిని వారి ఇష్టారాజ్యంగా నిర్వహిస్తున్నారనే విమర్శలున్నాయి.

తల్లిదండ్రులు గమనించాలి

విద్యా సంస్థల బస్సుల ప్రమాదాలు ఎక్కువ శాతం డ్రైవర్ల నిర్లక్ష్యం వల్లే జరుగుతుంటాయి. అనుభవం, ఇతర విషయాలను పట్టించుకోకుండా ఆ యా యాజమాన్యాలు డ్రైవర్లు నియమించు కుంటున్నాయి. రవాణా శాఖ నిబంధనల మేరకు డ్రైవర్ల నియామకం జరుగుతుందా..? లేదా అనే అంశాన్ని తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి.



తనిఖీలను త్వరలోనే ప్రారంభిస్తాం



విద్యా సంస్థల బస్సుల తనిఖీలను త్వరలోనే ప్రారంభిస్తాం. ఫిట్‌నెస్ పరీక్షలు చేయించక పోయినా.. ఇతర నిబంధనలు మేరకు బస్సులు లేకపోయినా భారీ జరిమానాలు విధిస్తాం. అవసరమైతే విద్యా సంస్థ లైసెన్స్ కూడా రద్దు చేస్తాం. అలాగే స్కూల్ పిల్లలను చేరవేసే ఆటోలపై తనిఖీలు నిర్వహిస్తాం.

-కే సీతారామిరెడ్డి, జిల్లా ఉప రవాణా కమిషనర్

బస్సుల విషయంలో పాటించాల్సిన నియమాలు

- పాఠశాల/కళాశాల పేరు, టెలిఫోను, మొబైల్ నంబర్లు సహా పూర్తి చిరునామా బస్సు ఎడమ వైపు స్పష్టంగా కనిపించేలా రాయాలి.
- అత్యవసర ద్వారం తప్పనిసరిగా ఉండాలి.
- ప్రతిబస్సులో ఒక అటెండర్ ఉండాలి.
- బస్సులో ప్రయాణిస్తున్న విద్యార్థుల పట్టిక అందుబాటులో ఉండాలి. అందులో పేర్లు, చిరునామా తప్పనిసరి.
- బస్సు ఇంజన్ కంపార్టుమెంట్‌లో ఒక అగ్నిమాపక యంత్రం, పొడి అందుబాటులో ఉంచాలి.
- సామర్థ్యాన్ని మించి విద్యార్థులను ఎక్కించ కూడదు.
- బస్సులో టీచరు, పేరెంట్స్ మానిటరింగ్ సభ్యులు తప్పనిసరిగా ప్రయాణించాలి.
- బ్యాగులు పెట్టుకునేందుకు ప్రత్యేక షెల్పులు ఏర్పాటు చేయాలి.

ఘాటెక్కిన పచ్చిమిర్చి

- కిలో రూ. 80లు, రూ.40 చేరిన టమాటా
- అదే బాటలో ఇతర కూరగాయల ధరలు



గుంటూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): కొద్ది రోజులుగా కూరగాయల ధరలు దడ పుట్టిస్తున్నాయి. మొన్నటి వరకు అందుబాటులో ఉన్న టమాటా, పచ్చి మిర్చి ధరలకు రెక్కలొచ్చాయి. నగరంలోని పెద్ద మార్కెట్‌లో పచ్చి మిర్చి కిలో రూ. 80కు విక్రయిస్తున్నారు. మొన్నటి వరకు కిలో రూ.40 ఉన్న ధర..ఒక్కసారిగా రెట్టింపు అయ్యింది. ఇక టమాటా కిలో రూ.20 నుంచి రూ.40కు చేరింది. వంకాయ మొన్నటి వరకు కిలో రూ. 30 ఉండగా ఇప్పుడు రూ. 60లు రెట్టింపు ధర పలుకుతోంది. దొండ కాయలు కూడా కిలో రూ.40 ఉండగా తాజాగా రూ. 60కి ధర చేరింది. ఇక ములక్కాయ మొన్నటి వరకు ఒకటి ఐదు రూపాయల ఉండగా.. ప్రస్తుతం ఒకటి రూ. 15ల నుంచి రూ. 20 వరకు విక్రయిస్తున్నట్లు వినియోగదారులు చెబుతున్నారు. కూరగాయల ఉత్పత్తి డిమాండ్‌కు అనుగుణంగా లేకపోవడమే ధరల పెరుగుదలకు కారణంగా వ్యాపారి రాపోలు మల్లికార్జునరావు తెలిపారు. ఇతర కూరగాయల ధరలు నిలకడగానే ఉన్నాయని పేర్కొన్నారు. మరి కొన్ని రోజులు ఇవే ధరలు కొనసాగే అవకాశం ఉందని చెప్పారు. రైతు బజార్లలో కూడా ధరలు పెరుగుతున్నాయి. టమాటా కిలో రూ. 33 ఉండగా పచ్చి మిర్చి కిలో రూ.62లకు విక్రయిస్తున్నారు. ఇక దొండ కాయలు కిలో రూ. 39లు కాగా క్యారెట్ రూ. 45లు ధర చెబుతున్నారు.

ఆన్‌లైన్ ట్రేడింగ్ పేరుతో రూ.27 లక్షల మోసం

గుంటూరు, జులై 7 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెడితే పెద్ద మొత్తంలో లాభాలు వస్తాయని.. పెట్టుబడులు పెట్టించి రూ.27 లక్షల మోసం చేశారని పొన్నూరు లోని ఇటికంపాడు రోడ్డుకు చెందిన మున్సిపల్ స్కూలు ఉపాధ్యాయుడు సోమవారం ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. తాను ఓ యాప్‌ను డౌన్లోడ్ చేసుకొని దాని ద్వారా ట్రేడింగ్ ప్రారంభించగా.. కొందరు తనకు ఫోన్ చేసి.. తక్కువ పెట్టుబడికి ఎక్కువ లాభాలు వస్తాయంటూ నమ్మించారన్నారు. మొదట్లో పెట్టుబడి పెట్టగా లాభం వచ్చినట్టు చూపించారన్నారు దీంతో ఆశపడి పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టగా తర్వాత ఒక రూపాయి కూడా రాలేదని తెలిపారు. ఖాతాలో తనకు లక్షల రూపాయలు వస్తున్నట్లు చూపిస్తున్నారని, డ్రా చేసేందుకు అవకాశం లేదని ఆయన పేర్కొన్నారు. నిందితులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకొని.. న్యాయం చేయాలంటూ సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించారు.

నేడు డీఆర్సీ సమావేశం



గుంటూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమీక్ష మండలి సమావేశం మంగళవారం మధ్యాహ్నం కలెక్టరేట్ లోని శంకరన్ కాన్ఫరెన్స్ హాల్‌లో జరగనుంది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి కందుల దుర్గేష్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ప్రజాప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు హాజరుకానున్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల మధ్యన ఈ సమావేశం జరుగుతుందని కలెక్టరేట్ వర్గాలు తెలిపాయి. గత సమావేశంలో ఆమోదించిన తీర్మానాలపై తీసుకొన్న చర్యలను తొలుత చర్చిస్తారు. అనంతరం వివిధ ప్రభుత్వ శాఖల పనితీరుని సమీక్షిస్తారు.

- జిల్లాలో ప్రస్తుతం ప్రధానంగా మండుతున్న అంశం హెచ్‌డీ బర్లీ పొగాకు కొనుగోళ్లు. ఏపీ మార్క్‌ఫెడ్ పొగాకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ రైతుల్లో అసంతృప్తి తొలగిపోలేదు. పొగాకు కొనుగోలు చేయడానికి అనేక కొర్రీలను అధికారులు వేస్తున్నారు. నాణ్యమైన పొగాకు తీసుకొచ్చినా థర్డ్ గ్రేడ్ కింద లెక్కించి క్వింటాకు రూ. 6 వేలు మాత్రమే లెక్కగడుతున్నారని రైతులు వాపోతున్నారు.
- రేషన్ పంపిణీలో ఎండీయూలను తొలగించి డీలర్ల వ్యవస్థని పునరుద్ధరించినప్పటికీ అక్రమాలు ఆగడం లేదు. నిత్యం జిల్లాలో ఏదో ఒక ప్రాంతంలో రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తూ పట్టుబడుతున్న ఉదంతాలు వెలుగులోకి వస్తున్నాయి. గత సమావేశంలో పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ అంశంపై ఆగ్రహం వ్యక్తం చేసినా.. అధికారుల తీరులో ఎలాంటి మార్పు రాలేదు.
- జిల్లాలో నకిలీ పురుగు మందులు, విత్తనాలు విచ్చలవిడిగా విక్రయాలు జరుగుతున్నాయి. వ్యవసాయ శాఖ అధికారులు అడపాదడపా దాడులు చేస్తున్నారే తప్పా సూత్రధారులను అడ్డుకోలేకపోతున్నారు.
- ఈ ఏడాది తీవ్ర వర్షాభావం కారణంగా ఇంకా పంటల సాగు లక్ష్యం మేరకు ప్రారంభం కాలేదు. డెల్టాలో కాల్వలకు నీరు విడుదల చేసినా ప్రస్తుతానికి తాగునీటి అవసరాల నిమిత్తం చెరువులు నింపడానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు.
- ఫిరంగిపురం పరిసర ప్రాంతాల్లో సాగవుతున్న డ్రాగన్, బొప్పాయి పంటల దిగుబడులు భారీగా రావడంతో వాటి ధరలు పతనం అయ్యాయి. నేడు కేజీ రూ.100కు డ్రాగన్ విక్రయించుకోవాల్సిన దుస్థితి తలెత్తింది. బొప్పాయి అయితే రూ. 100 ఐదు కాయలు ఇస్తున్నారు. దీని వల్ల రైతులకు పెట్టుబడి ఖర్చులు కూడా రావడం లేదు.

ఈ అంశాలన్నింటిపై డీఆర్సీలో చర్చ జరగాలని జిల్లా ప్రజలు కోరుకొంటున్నారు.

ఆటకు వీడని వైసీపీ శాప్ం..!

పేదలకు క్రీడా సౌకర్యాలు అందకుండా పోతున్నాయి. ఆట ఆడాలంటే డబ్బు కట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(శాప్) చేతిలో నడవాల్సిన ఇండోర్, అవుట్‌డోర్ స్టేడియాలు ప్రైవేటు వ్యక్తులకు ఆదాయ వనరుగా మారాయి. స్టేడియాల నిర్వహణను పూర్తిగా గాలికొదిలేసి.. ఆటలకు పనికిరాకుండా చేసేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో వేలం వేసి మైదానాలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడంపై ఎన్నికల సమయంలో పెదవి విరిచిన కూటమి నేతలూ.. ఇప్పుడు వారి దారిలోనే ఆక్షన్ పెట్టి..స్టేడియాలను అప్పగించేశారు.

- లీజుకు క్రీడా ప్రాంగణాలు
- తాజాగా నరసరావుపేట, తెనాలి ఇండోర్ స్టేడియాలు..
- నిర్వహణ లేక అధ్వానంగా తెనాలి స్టేడియం
- పరిమితి లేని వసూళ్లతో క్రీడాకారులు దూరం
- పర్యవేక్షణపై పట్టు కోల్పోయిన శాప్
- దెబ్బతింటున్న రూ.కోట్ల విలువైన ఆస్తులు
- వైసీపీ ప్రభుత్వంలో చేసిందే కూటమిలోనూ..



తెనాలి ఇండోర్ స్టేడియం

తెనాలి, జూలై 7, (ఆంధ్రజ్యోతి): నిధులు లేవన్న సాకుతో.. గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలనే అమలు చేస్తూ.. తాజాగా స్టేడియాలకు ఆక్షన్ పెట్టి ప్రైవేటు వ్యక్తులకు అప్పగించారు. నరసరావుపేట స్టేడియంను ఐదు నెలల క్రితమే అప్పగించగా.. తెనాలి స్టేడియానికి ఈ నెల 27న ఆక్షన్ నిర్వహించారు.నరసరావుపేట స్టేడియం గతంలో రూ.26,500 వేలం జరిగితే.. దీనిపై పది శాతం అదనంగా కలిపి వేలం నిర్వహించారు. తెనాలి స్టేడియం రూ.1.01 లక్షలకు గతంలో వేలం జరిగింది. దీనిపైనా అదనంగా ఆక్షన్ మొత్తాన్ని నిర్ణయించి వేలం పెట్టారు. నిజంగా నిర్వహణకు నిధులు లేమి ఉంటే..ప్రైవేటు వ్యక్తులకు అప్పగించిన తర్వాత వారు వసూలు చేసే ఫీజుల విషయంలో ఒక పరిమితి పెట్టాల్సి ఉంది. కానీ అదేమీ, లేకుండా.. వేలం డబ్బు కట్టేసి, ఎంతైనా వసూలు చే సుకోండి అన్న చందంగా శాప్ తీరు ఉంది. క్రీడాకారులు వస్తే మాకేంటి? రాకపోతే మాకేంటి? ఆపై మీ ఇష్టం అన్నట్లు నిర్ణయాలు ఉండ టం క్రీడాకారులను విస్మయానికి గురి చేస్తోంది.

> 'మేము అధికారంలోకి వచ్చాం.. వైసీపీ ప్రభుత్వంలో తీసుకున్న అనాలోచిత నిర్ణయాలను రద్దు చేస్తున్నాం. ప్రైవేట్ వ్యక్తులను ఖాళీ చేయించి, శాప్ ఆధ్వర్యంలోనే క్రీడా మైదానాలు, స్టేడియంలు నిర్వహి స్తాం. క్రీడలకు పూర్వ వైభవం తీసుకొస్తాం.' ఇదీ శాప్ చైర్మన్ రవినాయుడు ఇటీవల తెనాలి వచ్చినప్పుడు చేసిన వ్యాఖ్యలు.

ఆక్షన్‌లో..ఆట

క్రీడాలను గతంలో ఏ ప్రభుత్వం కూడా ఆదాయ వనరుగా చూడలేదు. పేద, ధనిక తేడా లేకుండా నైపుణ్యం ఉన్న క్రీడాకారులను వెలుగులోకి తీసుకురావడం, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పతకాలు సాధించి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకొచ్చే ఒక గొప్ప అవకాశంగానే పరిగణిస్తూ వచ్చాయి. అయితే.. రాష్ట్రంలోని క్రీడా మైదానాలు, ఇండోర్ స్టేడియాల నిర్వహణకు గత వైసీపీ ప్రభుత్వం ఆక్షన్ విధానం తీసుకొచ్చింది. తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులకు అప్పగించేసింది. పైగా వారు ఎంత ఫీజులు వసూలు చేస్తే అంత దండుకునే విధంగా విధివిధానాలు రూపొందించింది. దీనిని అప్పట్లో వారు బాగానే ఉపయోగించుకున్నారు. క్రీడాకారుల దగ్గర ముక్కు పిండి మరీ వసూలు చేసి దోచుకున్నారు. కానీ, క్రీడా మైదానాలను యథా స్థితిలో అప్పగించాలనే నిబంధనను మాత్రం గాలికొదిలేశారు. దెబ్బతిన్న మైదానాలు, స్టేడియం పరికరాలను మాత్రం అలానే వదిలేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని తెనాలి, నరసరావుపేట ఇండోర్ స్టేడియాలు, జిమ్ పరికరాలను భ్రష్టు పట్టించారు.

పేదలు క్రీడలకు దూరం..

గత వైసీపీ సర్కారు రావడంతోనే.. ఏ రంగం నుంచి ఎంత ఆదాయం పొందొచ్చు! ఏ రూపంలో దోచుకోవచ్చనే తరహాలో ఆలోచన చేసింది. క్రీడలను వ్యాపారంగా మార్చేయడంతో.. ఆ ఐదేళ్లు పేదలు క్రీడా మైదానాలకు దూరమయ్యారు. మట్టిలో మాణిక్యాలు మట్టిలోనే ఉండిపోయారు. ప్రైవేట్ వ్యక్తులు వసూలు చేసే ఫీజు లకు భయపడి అటువైపు రావడమే మానేశారు.

పూర్తి వసతులతో స్టేడియం నిర్మాణం

ఒక స్టేడియం, లేక ఏదైనా క్రీడా ప్రాంగణం లీజుకిస్తే..నిర్వహణను లీజుకు తీసుకున్న వారే బాధ్యులు. ఇక్కడ ప్రయివేటు విధానంలో వసూ ళ్ల మినహా నిర్వహణ లేనేలేని పరిస్థితి నెలకొం ది. 2017లో అప్పటి మంత్రిగా లోకేశ్ శంకుస్థాపన చేస్తే.. ఈ ఇండోర్ స్టేడియాన్ని 2018లో రూ.2 కోట్లతో పూర్తి చేశారు. లోపల నాలుగు షటిల్ కోర్టులు, టేబుల్ టెన్నిస్ కోర్టులు ఏర్పాటు చేశారు. షటిల్ కోసం ఉడెన్ ఫ్లోరింగ్‌ను రూ. కోటిన్నరతో అప్పటి ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్ పూర్తిచేయించారు. దీనిపై గ్రీన్ మ్యాట్ కూడా అమర్చారు. మరో రూ. 2 కోట్లకుపైగా ఖర్చుపెట్టి క్రీడా ప్రాంగణం చుట్టూ ప్రహరీ, లోపల క్రీడా మైదానం అభివృద్ధి చేశారు. వాకింగ్ ట్రాక్, జిమ్ పరికరాలు సమకూర్చారు. పూర్తి స్థాయి వసతులు కల్పించి, అప్పట్లో ఇక్కడ జిల్లా, రాష్ట్ర జాతీయ స్థాయి క్రీడా పోటీలు కూడా నిర్వహించారు.

రొచ్చు..రొచ్చు..

వైసీపీ సర్కారు వచ్చాక తెనాలి ఇండోర్ స్టే డియంలో.. మెమోరియల్ తరహా క్రీడా పోటీలు మినహా, ప్రతిష్ఠాత్మక క్రీడల నిర్వహణే లేకుండా పోయింది. తర్వాత ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వె ళ్లి.. ఇండోర్ స్టేడియం పైకప్పు దెబ్బతింది. వర్షపు నీరు లీకేజీ కావడంతో.. రూ.కోట్ల ఖర్చుతో వేయించిన చెక్క ఫ్లోర్ దెబ్బతిని పోతోంది. దీనిని సరిచేయించాల్సింది పోయి, నీరు పడుతున్న చోట మున్సిపాలిటీ డస్ట్ బిన్‌లను పెట్టి చేతులు దులుపుకున్నారు. ఇక రాత్రిళ్లు వర్షం పడితే మా త్రం చెక్క మొత్తం తడిచిపోయి పాడయిపోయి న పరిస్థితి ఉంది. ఉన్నవాటిని ఉన్నట్లు అప్పగించకుండా.. పాడయిపోయిన స్థితిలో తిరిగి శాప్‌కు అప్పగించారు. మళ్లీ ఇప్పుడు ఆక్షన్ పెట్టి మరొకరికి నిర్వహణ అప్పగించారు. వీరు కూడా వాటిని సరిచేయకపోగా, పాడయిన స్థానంలో ఏ మరమ్మతులు చేయించకుండా ఉన్నదానిని వా డుకుని డబ్బులు.. వసూలు చేసుకునే పరిస్థితే కనిపిస్తోంది.

నిధులు లేక..ప్రైవేట్‌కు...

ఒక స్టేడియం నిర్వహణకు రూ. లక్షల్లో ఖర్చవుతోంది. కోచ్‌లు సరిపడా లేరు. ఉన్నవారికి జీతాలు ఇచ్చే పరిస్థితి కూడా లేదు. శాప్‌కు నిధుల లేమి కారణంగా స్టేడియాలను లీజుకు ఇస్తున్నాం. వేలం నిర్వహించడం వరకే మా బాధ్యత. నిర్వహణ అంశాలను ఎప్పటికప్పుడు శాప్ పర్యవేక్షిస్తుంది. యథాతథ స్థితిలో స్టేడియం అప్పగించని వారిపై చర్యలుంటాయి. వారి నుంచి ఆ మొత్తాన్ని వసూలు చేస్తాం.

-నరసింహారెడ్డి, జిల్లా స్పోర్ట్స్ అధికారి, గుంటూరు

విజ్ఞానం మానవ...

కల్యాణానికే వినియోగించాలి

ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీ వీసీ శారదా జయలక్ష్మీదేవి

బాపట్ల, జూలై 7 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు తమ విజ్ఞానాన్ని మానవ కల్యాణానికి ఉపయోగించాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ డాక్టర్ శారదా జయలక్ష్మీదేవి పేర్కొన్నారు. డాక్టర్ ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన శాస్త్ర సాంకేతిక కళాశాల హాస్టల్, కాలేజీ డే వేడుకలను సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.సర్దార్ బేగ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వైస్‌చాన్సలర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జ్యోతిప్రజ్వలన చేసి, సభలో మాట్లాడారు. ఫుడ్ సైన్స్ అనేది కేవలం ఒక శాస్త్రమే కాకుండా సమాజాన్ని ఆరోగ్యంగా మార్చే శక్తి అని పేర్కొన్నారు. గౌరవ అతిథిగా పాల్గొన్న డాక్టర్ ఏవీ రమణారావు మాట్లాడుతూ ఫుడ్ టెక్నాలజి రంగంలో ఉన్న విస్తృత అవకాశాలను, పరిశ్రమలు ఎదుర్కొంటున్న సవాళ్లను విశ్లేషిస్తూ విద్యార్థులు సిద్ధంగా ఉండాలన్నారు. మరొక అతిథి పొట్లూరి భాస్కరరావు మాట్లాడుతూ విద్యార్థులు పరిశ్రమలు కోరుకునే నైపుణ్యాలపై దృష్టి పెట్టి ప్రాక్టికల్ పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం కళాశాల ఫుడ్ టెక్నాలజిస్ట్ మ్యాగజైన్‌ను విడుదల చేశారు. హాస్టల్ కార్మికులకు నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ ఎ.మణి, డాక్టర్ ఎస్.బ్లెస్సీ సాగర్, బోధన,బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న వీసీ డాక్టర్ శారదా జయలక్ష్మీదేవి తదితరులు

వడ్డీ చెల్లించలేదని...

ఇంటి నుంచి గెంటేశారు

- ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించిన బాధితులు



ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించిన తల్లీ, కుమారుడు

గుంటూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): తీసుకున్న బాకీకి సంబంధించి అధిక వడ్డీ డబ్బులు చెల్లించలేదని.. తమను ఇంటి నుంచి బయటకు గెంటేసి, తాళాలు వేశారని పాత గుంటూరులోని శివాలయం వెనుక బజారుకు చెందిన బాధితురాలు.. కుమారుడితో కలిసి సోమవారం ఎస్పీ కార్యాల యాన్ని ఆశ్రయించింది. బాధితుల ఫిర్యాదు మేరకు.. కార్పొరేషన్‌లో ఉద్యోగం చేసే వడ్డీ వ్యాపారి బండి రాంబాబు వద్ద 2022 మార్చిలో ఆమె రూ.3లక్షలు అప్పుగా తీసుకుంది. దానికి వడ్డీ చెల్లిస్తూ వస్తున్నారు. రెండో దఫా 2022 నవంబరులో మరో రూ.4 లక్షలు అప్పు తీసుకున్నామన్నారు. మొత్తం రూ.7 లక్షలు అప్పు తీసుకొని వడ్డీ చెల్లిస్తున్నారు. అనారోగ్య కారణాల వల్ల వడ్డీ చెల్లించలేకపోయా యని బాధితురాలు పేర్కొంది. మే 26న రాంబాబు, అతని భార్య, బంధువు లు ఇంటిపై దాడి చేసి తనను, తన కుమారుడిని ఇంటి నుంచి బయటకు గెంటి తాళాలు వేశారని వాపోయింది. అప్పటి నుంచి అక్కడే ఉన్న గుడిలో తలదాచుకుంటున్నామని చెప్పారు. అసలు రూ.7 లక్షలు చెల్లిస్తానని ప్రాధేయపడినా.. ఒప్పుకోకపోగా బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై పాత గుంటూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు కూడా చేశామని చెప్పారు. అప్పుడు ఇంటిలోకి వెళ్లగా.. మళ్లీ దాడి చేసిన బయటకు గెంటేశారని బాధితురాలు వివరించారు.

తూబాడు పాఠశాలను పరిశీలించిన డీవైఈవో

నాదెండ్ల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూబాడు గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలను డీవైఈవో సుభానీ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. లక్ష్యాన్ని ఎంచుకొని ఇష్టంతో చదివితే మంచి ఫలితాలు సాధించగలుగుతారని పేర్కొన్నారు. 10వ తేదీ జరగనున్న పేరెంట్స్ మీటింగ్‌కు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ప్రతిరోజు 10వ తరగతి విద్యార్థులకు సాయంత్రం ఒక గంట స్టడీ అవర్ ఏర్పాటు చేయాలని ప్రధానోపాధ్యాయులు పులిపాటి శ్రీనివాసరావుకు సూచించారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

కోటప్పకొండ త్రికోటేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.24.02 లక్షలు

కోటప్పకొండ (నరసరావుపేట రూరల్), జూలై 7: (ఆంధ్రజ్యోతి): ప్రముఖ శైవ క్షేత్రమైన కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం హుండీ లెక్కింపు నిర్వహించగా రూ.24,02,549 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం ఆలయంలోని హుండీలను లెక్కించగా అన్నదానం హుండీలో రూ.86051, ప్రధాన హుండీలో రూ.9,68,028, టిక్కెట్లు అమ్మకంతో ద్వారా రూ.9,09,090, ప్రసాదం విక్రయం ద్వారా రూ.4,39,380 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి చంద్రశేఖర్ తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నాదెండ్ల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన నాదెండ్ల సబ్ స్టేషన్‌లో ఫీడర్ మరమ్మతుల కారణంగా నాదెండ్లలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు డీఈఈ ఆర్.అశోక్‌కుమార్ తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గుర్తించి సహకరించాలని కోరారు.

విద్యుత్ శాఖ విజిలెన్స్ తనిఖీలు

రొంపిచర్ల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో విద్యుత్ శాఖ విజిలెన్స్ తనిఖీలు సోమవారం జరిగాయి. రొంపిచర్ల సెక్షన్ పరిధిలోని అలవాల, ఆరేపల్లి, గోగులపాడు, కర్లకుంట, కొత్తపల్లి, మాచవరం, సంతగుడిపాడు, తుంగపాడు, వీరవట్నం, విప్పర్లపల్లి గ్రామాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు విజిలెన్స్ సీహెచ్ వెంకటేశ్వరరావు, ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు రాంబొట్లు ఆధ్వర్యంలో ఈ తనిఖీలు జరిగాయి. మీటరు లేకుండా విద్యుత్ చౌర్యం, మీటరు ఉన్నప్పటికీ అక్రమంగా విద్యుత్ చౌర్యం, అనుమతించిన క్యాటగిరి కాక ఇతర క్యాటగిరి, అనుమతించిన లోడుకంటే అదనపులోడు వాడకం వంటి వాటిని పరిశీలించి రూ.4.58 లక్షలు అపరాధ రుసుం విధించినట్టు తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్వేయర్‌గా రవికుమార్ బాధ్యతల స్వీకరణ

శావల్యాపురం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయంలో మండల సర్వేయర్‌గా రవికుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈపూరులో మండల సర్వేయర్‌గా విధులను నిర్వహిస్తున్న రవికుమార్ డెప్యూటేషన్‌పై శావల్యాపురానికి వచ్చారు. ప్రస్తుతం ఇక్కడ చేసిన నాగరాజు నాయక్ డిప్యుటేషన్‌పై రొంపిచర్ల మండలానికి వెళ్ళారు.

అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలి

● కలెక్టర్ అరుణ్‌బాబు



ప్రజలనుంచి అర్జీల స్వీకరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, ఇతర అధికారులు

నరసరావుపేట టౌన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార (పీజీఆర్ఎస్) వేదికలో అందిన అర్జీల సత్వర పరిష్కారమే లక్ష్యంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పీ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. సోమవారం నరసరావుపేటలోని పల్నాడు జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో జిల్లా నలుమూలలు నుంచి అర్జీలు అందజేశారు. కలెక్టర్, జిల్లా రెవెన్యూ అధికారి మొత్తం 198 అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పీ అరుణ్‌బాబు మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో ఎటువంటి జాప్యానికి తావులేకుండా నాణ్యతతో పరిష్కరించాలన్నారు. అర్జీదారునికి సంతృప్తే ధ్యేయంగా పరిష్కార తీరు ఉండాలని స్పష్టం చేశారు. అర్జీలు రీ ఓపెన్ కాకుండా చర్యలు ఉండాలన్నారు. ఫిర్యాదుదారులతో ముఖాముఖిగా మాట్లాడి ఫిర్యాదుల సమస్యలను తెలుసుకొని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. జిల్లా అధికారులు వారి శాఖలకు సంబంధించిన అర్జీలను క్షుణంగా పరిశీలించి తమ సిబ్బందితో నిర్ణీత గడువులోగా త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యలు తమ పరిధిలోనివి కానప్పుడు వెంటనే సంబంధిత శాఖకు పరిష్కారం కోసం పంపాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కందులు, రబీ ధాన్యం కొనుగోలు చేయాలి

● రైతు సంఘం నాయకుల డిమాండ్

నరసరావుపేట టౌన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రైతుల వద్ద ఉన్న కందులు, రబీ ధాన్యం కొనుగోలు చేయాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు డిమాండ్ చేశారు. సోమవారం రైతు పండించిన పంటలు వెంటనే కొనుగోలు చేయాలని కోరుతూ రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేసి అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపూరి గోపాలరావు మాట్లాడుతూ పల్నాడు జిల్లాలో కంది పంట వేలాది ఎకారాలలో సాగుచేశారని, వందలాది టన్నులు రైతులు వద్ద నిలువలు ఉన్న మార్కెఫెడ్ కొనుగోలు ఆపడంతో నిల్వలు పేరుకుపోయాయన్నారు. అదేవిధంగా రబీ ధాన్యం కొనుగోలు అంతంత మాత్రంగానే జరిగినా, కొనుగోలు చేసిన ధాన్యానికి నేటికి డబ్బులు జమచేయలేదన్నారు. ప్రభుత్వం రంగంలోకి దిగి పండించిన పంటలను కొనుగోలుచేసి రైతులను ఆదుకునేందుకు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు చేకూరి సురేష్, రాజారపు ముని, వెంకలేశ్వర్లు, రైతులు యరబిక్కి ఏడుకొండలు, యరబిక్కి వెంకటరావు, బొప్పూడి అంజిబాబు, కావూరి వెంకటేశ్వర్లు, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

● చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



జంగాలపల్లిలో కరపత్రాలు పంచుతున్న చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, డీసీసీబీ చైర్మన్ మక్కెన

నూజెండ్ల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నట్టు ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. మండలంలోని జంగాలపల్లి గ్రామంలో సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ ప్రజలకు సకాలంలో సంక్షేమ పథకాలు అందిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో కూటమి ప్రభుత్వం తీసుకు వెళ్తుందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, మార్కెట్ యార్డు చైర్మన్ మీసాల మురళీకృష్ణ యాదవ్, టీడీపీ నాయకులు రొడ్డా వీరాంజనేయరెడ్డి, ఎన్ గురునాథం, జెడ్డా రామయ్య పాల్గొన్నారు.



ఇర్లపాడులో వంగవీటి మోహన్‌రంగా విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న పుల్లారావు తదితరులు

సమర్థ నాయకుడు చంద్రబాబు నాయుడు: ప్రత్తిపాటి

నాదెండ్ల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని సరిదిద్ద గలిగిన సమర్థ నాయకుడు చంద్రబాబు నాయుడు అని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా మండలంలోని అవిశాయపాలెం, ఇర్లపాడు గ్రామాల్లో ఆదివారం రాత్రి పుల్లారావు పర్యటించారు. ఈ సందర్భంగా ఇర్లపాడులో కృష్టారావు, కృష్ణమనాయుడు ఏర్పాటు చేసిన వంగవీటి మోహన్‌రంగా విగ్రహాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో సర్పంచ్ కామినేని లలిత నాగేశ్వరరావు, జనసేన, టీడీపీ నాయకులు తోట రాజా రమేష్, నెల్లూరి సదాశివరావు, బండారుపల్లి సత్యనారాయణ, మిరియాల రత్నకుమారి, గుర్రం నాగ పూర్ణచంద్రరరావు, గుర్రం ఉపేంద్ర, హనుమంతరావు, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

● నరసరావుపేట రూరల్: గ్రామాల అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని, అర్హులైన పేదలందరూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ సీనియర్ నాయకులు కొల్లి బ్రహ్మయ్య తెలిపారు. నరసరావుపేట మండలంలోని పాలపాడు గ్రామాలలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం శనివారం సాయంత్రం నిర్వహించారు. కార్యక్రమంలో పులిమి రామిరెడ్డి, షేక్ సుభాని, మార్కెట్ యార్డు చైర్మను పునాటి శ్రీనివాసరావు, క్లస్టర్ వసంత యలమంద, డి. శివరామకృష్ణ, ఎ.శ్రీనివాసరావు, కె.రాజు, కె.చిన్నశ్రీనివాసరావు, పి.బసవేశ్వరావు, ఎం.వీరయ్య, పెద్దిరెడ్డి, ఎ.శ్రీనివాసరావు, ఎం.శివరామకృష్ణ ఎం.ఆంజనేయులు రెండు గ్రామాల పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

● ఈపూరు: మండల కేంద్రమైన ఈపూరులో సోమవారం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి రాపర్ల జగ్గారావు పాల్గొన్నారు.

● రొంపిచర్ల: కూటమి ప్రభుత్వాన్ని రాష్ట్ర ప్రజలు ఆదరించాలని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు సోమవారం తెలిపారు. మండలంలోని అలవాల, తురుమెళ్ళ, చిట్టిపోతులవారిపాలెం గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పల్లెల నాగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి గాడిపర్తి సురేష్, కె.కొండలు, కె.కోటిరెడ్డి, ఎం.రామారావు, ఆయా గ్రామాల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



అలవాలలో కరపత్రాలు పంచుతున్న గ్రంథాలయ పరిషత్ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు



హోమంలో పాల్గొన్న ఆలయ సేవకులు

ఘనంగా మహా సుదర్శన హోమం

వినుకొండ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): శ్రీ లక్ష్మీ నరసింహస్వామి తొలి ఏకాదశి పండుగ పర్వదినంలో 3వ రోజు తిరునాళ్ల మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మహా సుదర్శన నవగ్రహ లక్ష్మీ గణపతి వాస్తు హోమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ముఖ్య సేవకులు, కార్యనిర్వహణ సేవకులు, గోసంరక్షణ ఆశ్రమ నిర్మాణ కమిటీ సేవకులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ర్యాలీ

వినుకొండ టౌన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): కార్మిక రైతు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 9వ తేదీన జరిగే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీపీఎం వినుకొండ కార్యదర్శి బొంకూరి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు పట్టణంలో సీఐటీయూ, రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ పల్నాడు జిల్లా అధ్యక్షులు హనుమంతరెడ్డి, రైతు సంఘం నాయకులు శివరామకృష్ణ, కోటిరెడ్డి, కేపీఎస్ నాయకులు నవీన్‌కుమార్, కృష్ణమూర్తి, భవన నిర్మాణ సంఘ నాయకులు వెంకటప్పయ్య, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మానవహారంగా నిలబడి ఆందోళన చేస్తున్న కార్మికులు

12 నుంచి నిరవధిక సమ్మె

నరసరావుపేట టౌన్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 12 నుంచి నిరవధిక సమ్మె నిర్వహిస్తాని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ పల్నాడు జిల్లా గౌరవ అధ్యక్షుడు షేక్ సిలార్ మసూద్ అన్నారు. సోమవారం నరసరావుపేట మున్సిపల్ కార్యాలయం వద్ద ఉన్న మహాత్మాగాంధీ విగ్రహం వద్ద మానవహారం నిర్వహించి నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో కార్మికులు, ఇంజనీరింగ్ విభాగం కార్మికులు చిన అల్లాబక్షు, సోమశేఖర్, సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మంద కృష్ణమాదిగ జన్మదినం

వినుకొండ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవం, మంద కృష్ణమాదిగ జన్మదిన వేడుకలను ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో దారివేముల దాసు, లింగయ్య, కడియం మరియబాబు, సంపెంగుల శివ, ఏసు, పెద్దేటి బాల, మాచర్ల బుజ్జి, కొమ్ము మరియబాబు, పోలేపల్లి దిలీప్, మందా వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహరం

యడ్లపాడు, జూలై (ఆంధ్రజ్యోతి) 7: త్యాగానికి ప్రతీక అయిన మొహరం పండుగను మండల ప్రజలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. కొండవీడు కోట, బోయపాలెం, యడ్లపాడు, వంకాయలపాడు, తిమ్మాపురం, కారుచోల గ్రామాల్లోని చావిళ్ళలోని పీర్లను అందంగా అలంకరించారు. మొక్కులు చేసుకున్న భక్తులు పూల బాషికాలను చావిళ్ళలోని పీర్లకు ముజావర్లచే అలంకరింపచేశారు. ఈ సందర్భంగా మట్టి పాత్రలలో పానకాన్ని తెచ్చి చిన్నారులకు, భక్తులకు పంపిణీ చేశారు. సాయంత్రం పీర్లను మేళతాళాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. మొహర్రం సంతాప దినాల్లో భాగంగా కొండవీడులో నిర్వహించే మొహర్రం వేడుకలను తిలకించేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. పది రోజుల పాటు నిర్వహించిన మొహర్రం వేడుకలు 11వ రోజైన ఆదివారం పీర్ల జలధితో ముగిశాయి. పీర్ల చావిడిలో ప్రార్థనల అనంతరం రాత్రి 1.10గంటల సమయంలో విద్యుత్ వెలుగుల మధ్య నిప్పుల గుండంలో నడిచే కార్యక్రమాన్ని నిర్వహించారు. కొండవీడులో ఆదివారం సాయంత్రం జరిగిన మొహర్రం ఉత్సవాల్లో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పాల్గొన్నారు. పీర్ల చావిడిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం సంతాప కార్యక్రమాల్లో భాగమైన పీర్ల ఊరేగింపును ప్రారంభించారు.



పీర్ల ఊరేగింపును లాంఛనంగా ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

రొంపిచర్లలో పీర్ల ఊరేగింపు

రొంపిచర్ల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్ర మైన రొంపిచర్ల గ్రామంలో పీర్ల ఊరేగింపు సోమవారం కూడా కొనసాగింది. మూడు ప్రాంతాల్లో పీర్ల చావిడిల వద్ద పీర్లు ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. రొంపిచర్లతో పాటు విప్పర్ల, ఎడ్వర్డుపేట, కొత్తపల్లి, సంతగుడిపాడు, మునమాక, గోగులపాడు, అలవాల, గ్రామాల్లో మేళతాళాల మధ్యపీర్ల ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు.



గ్రామాల్లో ఊరేగిస్తున్న పీర్లు

మున్సిపల్ అధికారులు, కౌన్సిలర్లతో

ఎమ్మెల్యే ప్రత్తిపాటి సమీక్ష

చిలకలూరిపేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థికసంఘం రెండో విడత నిధులు రూ.1.90 కోట్లతో కౌన్సిలర్లు తమ వార్డుల్లో ప్రజలకు అత్యవసరమైన పనుల్ని పూర్తిచేయాలని, 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మంజూరైన బీపీఎస్, ఎల్‌ఆర్‌ఎస్ గ్రాంట్ రూ.3.50 కోట్లతో సీసీ రోడ్లు,డ్రైన్ల నిర్మాణంతో పాటు తాగునీటి సరఫరా, ఇతర అభివృద్ధిపనులు చేపట్టాలని, అందుకు అవసరమైన ప్రణాళికను అధికారులు సిద్ధం చేయాలని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సోమవారం కోరారు. మున్సిపల్ అధికారులు కౌన్సిలర్లతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. వార్డుల్లోని సమస్యలపై కౌన్సిలర్లు ప్రత్యేక దృష్టిపెట్టాలని, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారంపై శ్రద్ధ పెట్టాలన్నారు. ఆక్రమణలపై వెంటనే దృష్టిపెట్టాలని, రోడ్ల విస్తరణకు ఉన్న అడ్డంకుల్ని తొలగించి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేయాలని చెప్పారు. జాతీయస్థాయి సదస్సులో పాల్గొని తిరిగి వచ్చిన సందర్భంగా మున్సిపల్ చైర్మన్ షేక్ రఫానీని ఎమ్మెల్యే పుల్లారావు ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు.

టీడీపీ బాధ్యులతో సమావేశం

చిలకలూరిపేట, జూలై 7 (ఆంధ్రజ్యోతి): వైసీపీ దుష్ప్రచారంపై పార్టీ శ్రేణులు వేగంగా స్పందించాలని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు సోమవారం అన్నారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలన, ప్రభుత్వ పనితీరు, ప్రజలకు అందించిన సంక్షేమం, రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించాల్సిన బాధ్యత టీడీపీ శ్రేణులదేనన్నారు. టీడీపీ బూత్, క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జ్‌లు, పట్టణ, నాదెండ్ల, యడ్లపాడు మండల నాయకులతో ఆయన ఇక్కడ సమావేశమయ్యారు. పట్టణ పరిధిలోని ఇన్‌చార్జ్‌లు, కుటుంబ సాధికార సారధిలు ప్రభుత్వ పనితీరుపై విస్తృతంగా ప్రచారం చేయాలని, మై టీడీపీ యాప్‌లో ఎప్పటికప్పుడు తమ పరిధిలోని 50ఇళ్ల వివరాలు నమోదుచేయాలని ఆయన సూచించారు. పార్టీ పరిశీలకులు ఉషారాణి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 96 ఫిర్యాదులు



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ కంచి శ్రీనివాసరావు

నరసరావుపేట లీగల్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్పీ కంచి శ్రీనివాసరావు పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. మొత్తం 96 ఫిర్యాదులు అందాయి. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ప్రజలకు వారి ఫిర్యాదులను రాసి పెట్టడంలో పోలీస్ సిబ్బంది సహాయ సహాయ సహకారాలు అందించారు. దూరప్రాంతాల నుంచి వచ్చే అర్జీదారుల కోసం భోజన ఏర్పాట్లు చేశారు.

నేత్రదానంతో వేల్పూరువాసి ఆదర్శం



మృతుడు మస్తాన్ సాహెబ్ (ఫైల్‌ఫొటో)

వేల్పూరు (శావల్యాపురం) జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేల్పూరుకు చెందిన మస్తాన్ సాహెబ్ (85) వృద్ధాప్యంతో సోమవారం మృతిచెందాడు. మృతుడు మస్తాన్ సాహెబ్ నేత్రాలను కుటుంబసభ్యులు దానం చేసి పలువురికి ఆదర్శంగా నిలిచారు. అమ్మ నేత్ర, అవయవ, శరీరదాన ప్రోత్సాహకుల సంఘం జిల్లా కోఆర్డినేటర్ సంద్రపాటి చలపతిరావు ఇచ్చిన సమాచారంతో పెదకాకాని శంకర్ ఆసుపత్రి ఐ-బ్యాంక్ సిబ్బంది వేల్పూరుకు వచ్చి మృతుని కళ్ళలో కార్నియా పొరలు సేకరించారు.

శావల్యాపురం మేజర్ మరమ్మతులు ప్రారంభం

శావల్యాపురం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): గంటవారిపాలెం డీసీ పరిధిలోని శావల్యాపురం మేజర్‌కు మరమ్మతు పనులను డీసీ చైర్మన్ మందలపు వెంకటనారాయణ ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభించారు. మేజర్ కాలువకు ఇరువైపులా పిచ్చిమొక్కలు తొలగించి కాలువలో పూడిక తీయనున్నట్లు చైర్మన్ వెంకటనారాయణ తెలిపారు. గంటవారిపాలెం డీసీ పరిధిలోని పిట్టంబండ్ల, శానంపూడి, శావల్యాపురం, ఏనుగుపాలెం-1, ఏనుగుపాలెం-2 మేజర్‌కాలువల మరమ్మతులకు ప్రభుత్వం రూ.60లక్షలు నిధులు కేటాయించిందన్నారు. సాగునీటి సంఘాల అధ్యక్షులు చెరుకూరి రామాంజనేయులు, మొద్దుల శ్రీనివాసరావు, నాయకులు చెరుకూరి చౌదరి, కర్రి అంజయ్య, పాలడుగు కొండలు, కాకాని వేణు, వెంకటకృష్ణయ్య, ప్రభుహుస్సేన్, ఏఈ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ పరిశీలన

నూజెండ్ల, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పువ్వనూతన గ్రామ పంచాయతీ పరిధిలో కేంద్ర బృందం స్వచ్ఛ సర్వేక్షణ అమలుపై సోమవారం పరిశీలన చేశారు. ఈ సందర్భంగా రవ్వవరంలో తాగునీరు, పారిశుధ్యం, ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ల పనితీరు, ప్రభుత్వ కార్యాలయాలు, హెల్త్ సెంటర్లు, ప్రభుత్వ పాఠశాల, ప్రభుత్వ పోత్సాహకంతో నిర్మించుకున్న గృహాలు, మరుగుదొడ్ల వాడకం తదితర అంశాలను గ్రామస్థులతో మాట్లాడి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో కేంద్ర బృందం సభ్యులు భాస్కర్, రమేష్, సర్పంచ్ శ్రావణి నాగరాజు, ఈవోపీఆర్‌డీ షేక్ రబ్బానీ, పంచాయతీ కార్యదర్శి చిట్టిబాబు, స్వచ్ఛ మండల కో-ఆర్డినేటర్ కె.సుబ్బరామయ్య, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు బలరామ్ తదితరులు పాల్గొన్నారు.

పెంపుడు జంతువులకు టీకాలు

వినుకొండ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ జోనోసిస్ డే కార్యక్రమాన్ని ఏరియా పశువైద్యశాఖ అధికారి నేలపల్లి శ్రీరాములు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని సుమారు 75 పెంపుడు కుక్కలకు యాంటీ రాబీస్ టీకాలను వేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తప్పనిసరిగా పెంపుడు జాతి కుక్కలకు, వాటి పిల్లలకు వ్యాక్సిన్ వేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో మౌనిక, నాగరాజు, రామారావు, సుభాని, రాజు, భార్గవి తదితరులు పాల్గొన్నారు.